స్వామిజీ అర్హతలను గురించి వారు అంతకు పూర్వమే పరిశీలించుతూ వచ్చి పెనుగొండలో సబ్ రిజిస్ట్రారుగా ఉం టున్న కాలంలోనే సాక్షాత్కరించి ఎన్నిక చేశారు. వారి నిజాయితీ, సేవా తత్పరత, సత్యసంధత, ఋజువర్తన, నిరా డంబరత అన్నీ బాబాను ఆకర్షించినవి. వెంటనే బాబాకుతగిన భక్తుడు లభించారన్న భావం కలిగింది. పోస్టులో, బాబా చిత్రపటం ద్వారా శ్రీ స్వామి కేశవయ్యాజీకి సాక్షాత్కార మైనారు. నాటి నుంచి నేటి వరకూ ఆ చిత్రపటం అనేక మహత్కార్యాలను సాధించింది. ఇప్పటికీ శ్రీ స్వామిజీ బాబాకు విగ్రహాలు గాక, చిత్రపటాలనే ఆవిష్కరించాలి అంటారు. అవును, కొందరికి విగ్రహారాధనలో నమ్మకం ఉండదు. కొన్ని మతాలకు విగ్రహారాధన సమ్మతం కాదు. ఆ కారణంగానే బాబా సమాధి అవుతూ తన విగ్రహాలను ప్రతిష్ఠింప వద్దని సూచించారు. షిర్డీలో కొందరు భక్తులు అధికోత్సాహంతో విగ్రహాన్ని తయారు చేయించి, ప్రతి ష్ఠకు పూనుకునే సమయానికి బాబా అవతారం చాలించారు. బాబాకు తిరిగి అవతార మెత్తవలసిన అవసరం ఉంటుం దని గాని, ఎత్తడం అనివార్యం అని గాని భావించి యుండ లేదు. కనుకనే నా సమాధి నుంచే నేను నా భక్తుల కోరికలను తీరుస్తాను. అభీష్టాలను నెరవేరుస్తాను- అని వాగ్దానం చేసి, ఆ వాగ్దానాన్ని అక్షరాలా పాటిస్తూ వున్నారు.

శ్రీ స్వామి కేశవయ్యజీ అవకాశం లభించినప్పుడు, ఆరోగ్యంగా వున్నప్పుడు ఆంధ్ర, కర్నాటక ప్రాంతాలలో విరివిగా పర్యటనలు చేసి సాయి సూక్తులను, సిద్ధాంతాన్ని ప్రచారం చేస్తూ వచ్చారు. ఆ పర్యటనల సందర్భంలో కూడా పూజలు జరిపి బాబా భక్తులకు అనేక విధాల సహాయం చేస్తూ వచ్చారు. ఇప్పటికీ చేస్తూనే ఉన్నారు. ఈ రోజు వారు గూడూరు దివ్యజ్ఞాన సమాజం వారి ఆహ్వానాన్ని పురస్కరించుకుని గూడూరు సందర్శించుచున్నారు. శ్రీ స్వామిజీ ఆధ్యాత్మిక ప్రసంగాలు పండితులకు, పామరులకు కూడా ఆకర్షవంతంగా వుండి, నిగూఢమైన ఆధ్యాత్మిక విషయాలను సులభంగా బోధపరుస్తూ వుంటవి. వారి అనుభవాలనుంచి వారు బాబా లీలలను వివరిస్తూ వుంటే ప్రజలు ఉత్తేజితులై ఆధ్యాత్మిక మార్గానువర్తు లవుతూ వున్నారు. ముందు ప్రజలను బాధా విముక్తులను చేయాలనీ, ఆకలి గొన్నవారికి అన్నంపెట్టి క్షుద్బాధ తొలగించి, ఆ తరువాత భక్తి మార్గం చూపాలని బాబా చెప్పిన మాటలను స్వామిజీ అక్షరాలా పాటిస్తారు.

నిత్య జీవితంలో అనుసరించ వలసిన విషయాలను శ్రీ స్వామిజీ ధర్మపన్నాలుగా, సూక్తులుగా సుబోధకమైన సులభ భాషలో భావాలతో వివరిస్తూ ఉంటారు. శక్తికి లోబడి దానం, ధర్మం చేయమంటారు. పది మందికి తెలియాలని ధర్మం చేసి లాభం లేదంటారు. యాచకులను, పేదలను కసిరికొట్టి పంపడం మహా పాపం అంటారు. ఇవ్వలేకపోతే మంచి మాటలతో చెప్పి పంపమంటారు. భగవంతుడు సర్వాంతర్యామి. ఎప్పుడు ఏ రూపంలో ఎక్కడ సాక్షాత్కార మవుతాడో ఎవరు చెప్ప గలరు? కనుకనే అన్ని భూతాలయెడల దయ కలిగి ప్రవర్తించాలని శ్రీ స్వామిజీ చెబుతూ వుంటారు. బాబా ఆ విధంగానే భక్తులను పరీక్ష చేస్తూ వుంటారనీ, అందువల్ల సాయి భక్తులు ఎల్లప్పుడూ అందరినీ సమంగా, సాదరంగా, చూస్తూ వుండాలనీ, శ్రీ స్వామిజీ అంటారు. స్వామిజీ ప్రబోధం బాబా సిద్ధాంతాల ప్రచారానికి అమితంగా తోడ్పడుతూ వున్నది.

(ఆంధ్రప్రభ సౌజన్యంతో)



'విష్ణుభక్తిలేని విబుధుండు విబుధుఁడే
పాదయుగముతోడి పశువుగాక.'

—పోతన

గురుతర భద్ర పద సంసిద్ధికి గురుపాద సంసేవనమే శరణ్యం

'అమాత్యుడు'

"దివ్యశాంతి సందేశోపదేశపరుల
శుభపదాంభోరుహము లెంత సుందరములు!"

ఇది పవిత్ర గ్రంథమైన బైబిలులోని సూక్తి.

మహాత్ముల సుందరపాదారవింద సంసేవనమువల్ల మానితమైన మనశ్శాంతి లభిస్తుంది.

మానవుడు లోకంలో తొలిసారి కనులు తెరచినది మొదలు కడసారి కనులుమూసే వరకు అన్నీ సమస్యలే, సంఘర్షణలే. రాళ్ళతట్టలను మోసి బ్రతికే శ్రమజీవికి, రత్నకిరీటం ధరించి దొరతనం చెలాయించే రారాజుకు కూడా భయము, కష్టచయము, బాధార్తి, దుఃఖానుభవములు తప్పవు. ముఖ్యంగా అల్లరులతో, కల్లోలాలతో, దారుణ హింసాకాండలతో, మారణహోమాలతో సంక్షుభితమైన ప్రస్తుత ప్రపంచంలో శాంతి ప్రాముఖ్యం ఇనుమడించింది. దుఃఖాన్ని నిరసించడం, సుఖాన్ని కాంక్షించడం ప్రతి ప్రాణికి సహజం. శాంతిలేనిచో సుఖము లేదు. శాంతి శ్రేయస్సును వర్ధిల్ల జేస్తుంది. అట్టి శాంతిని మహాత్ముల దివ్య పాదధూళిని శిరసావహించి పొందవచ్చును. మహాత్ములకు, ఋషిసత్తములకు, గురూత్తములకు మన పుణ్యభూమి పుట్టినిల్లు కావడం మన అదృష్టం.

స్వామి కేశవయ్యజీ సందర్శనభాగ్యం నాకు లభించింది. స్వామీజీ సాయితత్వమహిమాన్వితులు. వారు సాయిబాబా ఘనతను కీర్తిస్తారు. ఆయన అద్భుతలీలలను అభివర్ణిస్తారు. సన్మార్గావలంబన విధానాన్ని మనకు ఉద్బోధిస్తారు. సత్యసంధత, సాధుజన సంసేవనము. సర్వమత సమాదరభావము, ఇష్టదైవతోపాసనము—ఇవి ఉత్తమ గతికి స్వర్ణసోపానములని విశదీకరిస్తారు.

స్వామీజీ ఇలా చెప్పారు:

జంగమస్థావర రూపమైన ఈ సృష్టిలోని జీవరాసులలో నరజన్మ అత్యంత ఉత్కృష్టమైనది. పూర్వజన్మ పుణ్య పరిపాకమువలన మనకు మానవజన్మ సిద్ధించింది. ఇది క్షణభంగురము వంటిది. ప్రాణములు పోయిన పిదప ఈ శరీరములో ఒక్క అవయవము కూడా ఉపయోగకరము కాబోదు. కొన్ని జంతువుల చర్మము పాదరక్షల నిర్మాణానికైనా వినియోగపడుతుంది. కాని, మన చర్మం అందుకుకూడా పనికిరాదు. కనుక సమయము మించిపోక మునుపే మనం త్వరపడాలి. అధోగతిపాలు కాకుండా సత్కర్మాచరణముతో ఈ జన్మను సార్థకం గావించుకోవాలి. ఆత్మసాక్షాత్కారమును సాధించడమే, సచ్చిదానందస్వరూపుడైన దైవసాయుజ్యమును పొందడమే జన్మకు చరమధ్యేయం, సార్థక్యం.

అయితే, ఆత్మసాక్షాత్కారసిద్ధి అంత సులభ సాధ్యం కాదు. ధ్యేయాన్ని చేరడానికి, కామక్రోధ లోభ మోహ మద మాత్సర్యాది క్రూర వన్యమృగములతో, రజస్తమో గుణాది రాక్షసులతో తాపత్రయాది తస్కరులతో నిండిన దారి తెన్ను కానని దుర్గమ కాననాన్ని దాటవలసి వుంటుంది. మరి ఈ అరణ్యాన్ని తరించడం ఎట్లా? దానికి ఒక్కటే మార్గం: ఆ అరణ్య స్వరూప స్వభావాలను చక్కగా ఆకళించుకొని, నిర్వక్రమైన మార్గం తెలిపిన గురువును ఆశ్రయించడమే ఆ మార్గం. సద్గురు పాదసంసేవనంవల్ల గురుతర భద్రపద సంసిద్ధిని, జన్మరాహిత్యాన్ని పొందవచ్చును. ఎంత విద్య, విజ్ఞానం వున్నా, గురుని కరుణ లేక కుదుట బడవు.

అట్టి సమర్థ సద్గురూత్తముల కోవలో అగ్రగణ్యుడు శ్రీ సాయిబాబా. ఆయన కేవలం అవతార పురుషుడు. అవాఙ్మానస గోచరుడైన, నిర్వికార నిరంజనుడైన పరబ్రహ్మకు సాక్షాత్తు సగుణ స్వరూపుడు ఆయన. ఆయన దివ్యరూపమును హృదయ వదనమున నిల్పుకొని ఆరాధించినచో అవ్యయానందపదము నందగలము.

ఋషులు, ముముక్షువులు సర్వ సాధారణంగా లోక వ్యవహారాలను పట్టించు కొనకుండా, జనసంఘాలకు దూరంగా ఎక్కడో అడవులలో, కొండలపై వసిస్తూ సాధనచేసి తమ సద్గతికి మార్గం చూసుకుంటారు. కాని, సాయిబాబా అలాగ కాదు. సర్వసంగ పరిత్యాగియై కూడా ఒక చిన్న మసీదును షకాంగా చేసుకొని జనమధ్యం

లోనే నివసిస్తూ వారి కష్టనష్టాలను నివారిస్తూ వారి శ్రేయోభివృద్ధికై తామరాకుపై నీటి బిందువువలె పాటు పడిన మహానుభావుడు.

"ఎంద రెందరుండి రిలను బాబాలు, బా—
బాలకెల్ల సాయిబాబ బాబ:
ఆశ్రితాళి మ్రొక్క 'అచ్ఛా కరేగ అ—
ల్లా' యటంచు అభయలాభ మిచ్చు!"

గురువు సర్వజ్ఞుడు, సర్వసమర్థుడు, సర్వేశ్వర స్వరూపుడు, సత్కారుణా సముద్రుడు. ఏటికి ఈవలి ఒడ్డున తాబేలు వుంటుంది. అవలి ఒడ్డున దాని పిల్లలు వుంటాయి. ఆ తాబేలు బాలకాలు అవలి ఒడ్డునుంచి తమ తల్లి మోము పైనే దృష్టి నిల్పి చూస్తూ వుంటాయి. తల్లి తాబేలు వాటి వంకే నిండు వాత్సల్యంతో చూస్తూ వుంటుంది. అంతే, పిల్ల తాబేళ్ళకు ఆహార పానీయాలతో నిమిత్తం లేదు. ప్రేమ పూరితములైన తమ తల్లి చూపులే వాటిని ప్రవర్థమానం గావిస్తాయి. అలాగే, అచంచల విశ్వాసంతో మనం అనుక్షణం గురువును ధ్యానిస్తూ వుంటే ఆయనే పరమవాత్సల్య ప్రపూర్ణములైన దృక్కులతో మనలను సదా వీక్షిస్తూ సదసద్వివేకాన్ని ప్రసాదించి మన భారము లన్నిటినీ వహిస్తూ దయతో మనలను దరిచేరుస్తాడు.

సాయిబాబాను గురించి పూర్తిగా తెలుసుకొనడానికి గాని, తెలిసినంతవరకు ఆయన ఘనతను వేనోళ్ళ చాటి చెప్పడానికిగాని ఒక జన్మ చాలదు.

మానవావతారమెత్తిన సాయిబాబా సోదర మానవుల సముద్ధరణకై ఆ నిర్యాణము కృషి చేశారు. ఆయన నేడు మన మధ్య లేకపోయినా షిర్డీలోని మహా సమాధినుండి ఈ అనంత విశ్వమంతా నిండి వుండి భక్తుల కోర్కెలను నెరవేరుస్తానని బాస చేశారు. భక్త చింతామణి బాబా.

ఆయన సర్వమత సమాదరభావాన్ని ప్రబోధించారు. దాని ప్రాముఖ్యం ప్రస్తుత పరిస్థితులలో ఎంతైనా ఉన్నదని వేరే చెప్పనవసరం లేదు కదా!

మతము లెన్ని వున్నా వాటి కన్నిటికి పట్టుకొమ్మ సృష్టి స్థితి లయకారకుడైన సర్వేశ్వరుడే. వివిధ భాషలలో నీరు అనే దానికి వివిధ పదములున్నప్పటికీ ఆ పదమును ఉచ్చరించినప్పుడు ఆయా భాషలవారికి జలమనే పదార్థమే అవబోధమవుతున్నట్టు, వ్యవహారంలో ఎన్ని పేర్లు వున్నప్పటికీ భగవంతుడు ఒక్కడే. అతడే హరి, ఆదినారాయణుడు, అల్లా.

"పరగ పేర్లు వేరు పరమాత్మ డొక్కడే
మతము లెన్నియొ అభిమత మొకండె:
విశ్రమింప నిండ్లు విశ్వకుటుంబికి
మందిరమ్ము, మసీదు, పాదిరి గుడి!"

సాయిబాబా తన నివాసమైన మసీదులో ప్రతి సంవత్సరం శ్రీరామనవమి ఉత్సవాలను కడువైభవంగా జరిపించేవారు.

భవసాగర తరణానికి బాబా వర్తమాన కాలపరిస్థితులకు అనుగుణమైన సులభ మార్గాలను సూచించారు. ఆయన సన్యసించ మన లేదు. యజ్ఞయాగాదు లొనరించ మన లేదు. వేదశాస్త్రాధ్యయనమును విధించ లేదు. మంత్ర తంత్రముల నుపదేశింప లేదు. ఉపవాసాది కఠోర నిష్ఠలను శాసించ లేదు. జనులకు దూరం కమ్మన లేదు. నిర్మమత్వంతో నిత్యసంసారజీవనం నెరపుతూనే దినమున కొక్కసారి తీరిక యైనప్పుడు నిర్మలమైన భక్తితో తనను, లేదా తన యిష్టదైవాన్ని వీలై నన్నిసార్లు ధ్యానించాలని చెప్పారు. "సర్వ తీర్థాభిగమనంబు, సర్వవేద సమధిగమము సత్యంబుతో సరియుగావు"—సర్వేశ్వరుని నమ్మి సర్వదా సత్యమునే పల్కుతూ స్వధర్మాన్ని నిర్వర్తించా లన్నారు.

అన్నింటి కంటె భక్తి ప్రధానము. భక్తిలో దొడ్డ శక్తి యిమిడి వున్నది. భక్తులకు అసాధ్య మనేది వుండదు. భగవంతుడు భక్తపరాధీనుడు. పూవు పుట్టగనే పరిమళించు నన్నట్టు ధ్రువుడు, ప్రహ్లాదుడు, హనుమంతుడు మున్నగు పరమ భాగవతోత్తములకు హరినామ స్మరణం ఉగ్గుబాలతోనే అలవడినది. "ఇందు గలడందులేడని, సందేహము వలదు, చక్రి సర్వోపగతుం డెందెందు వెదకి చూచిన యందందే గలడని ప్రహ్లాదుడు నిరూపించినాడు. హృదయమును చీల్చి అందు సీతారాములను ప్రదర్శించిన హనుమంతుడు రామాజ్ఞను శిరసావహించి లంకను చేరడానికి సముద్రాన్ని అవలీలగా లంఘించినాడు. భక్తాగ్రేసరుడైన భీముడు నిదురించు చున్నప్పుడు సైతం ఆయన ఉచ్ఛ్వాస నిశ్వాసములనుండి, ప్రతి రోమకూపంనుండి 'కృష్ణ' శబ్దం వినిపించెడిదట. భగవంతుడు మననుండి భక్తిని, ప్రేమను మాత్రమే కోరతాడు. మన అభీష్టముల నన్నిటిని నెరవేరుస్తాడు.

సాయిబాబా పేదలపాలిటి పెన్నిధి. ఆయన భక్తులవద్ద దక్షిణలను స్వీకరించి బీదవారికి పంచి పెట్టేవాడు. అన్నార్తులకు, రోగగ్రస్తులకు భక్తి కుదురుకొనడం దుర్లభం గనుక, ముందు ప్రతి వ్యక్తి అన్నోదకాలకు లోటు లేని ఆరోగ్యవంతుడుగా ఉండేటట్టు చేయడం అవసర మంటారు. భాగ్యవంతులకు విందులు కుడిపి సంతుష్టులుగా చేయజూడడం కంటె పేదసాదలకు ప్రేమతో పట్టెడన్నం పెట్టడంవల్ల ఎంతైనా పుణ్యం వస్తుం దన్నారు. బిచ్చగానికి పెట్టకపోతే మానె కొట్టి తరిమివేయడం మహా పాప మన్నారు.

భక్తులకు బాబా స్వప్నాలలో వివిధ రూపాలలో దర్శన మిస్తారు. కాని, ఆయన స్వామీజీ వెంట సంతతం తోడు నీడవలె వుంటూ కర్తవ్యాన్ని ప్రబోధిస్తూ వుంటారు. బాబాకు మనవి చేసి ఆయన అనుమతి పొందనిదే స్వామీజీ ఏ పనీ చేయబోరు.

స్వామిజీ త్రికాలవేది. కోరితే మన భవిష్యత్తును గురించి చెబుతారు, తగు సలహా లిస్తారు, ఆ మన భక్తులకు సాయి తత్వాన్ని ఉపదేశించి ఆశీర్వదించి, షిర్డీనుంచి తెప్పించిన పవిత్రమైన ఊది (విభూతి)ని, ప్రసాదములను పంచి పెడ తారు. భక్తులలో కొందరికి మంత్రపూతములైన, ఐశ్వ ర్యాభివృద్ధికరములైన నాణెములను ప్రసాదిస్తారు. ఆయన ఎందరికో కుదరవనుకొన్న మొండి రోగములను తన మహిమ వలన నయంచేసి వారి కృతజ్ఞతను చూరగొన్నారు.

అతి సామాన్యునివలె కనిపించిన ఒక వృద్ధ భక్తుడు వచ్చి స్వామీజీకి అమిత భక్తి తాత్పర్యములతో సాష్టాంగ పాదాభివందనంచేసి ఆశీర్వాదంపొంది వెళ్లాడు. అతడు వెళ్ళిపోయిన తరువాత స్వామీజీ ఇలా అన్నారు: "ఇతడు గొప్ప ఆస్తికుడు. దాదాపు నలభై సంవత్సరముల క్రిం దట పేదరికంలో బాధ పడుతున్న ఇతనికి దాచుకొమ్మని ఒక నాణెము నిచ్చాను, అప్పటినుంచి ఇతడు భక్తితో బాబాను సేవిస్తున్నాడు. ఇప్పుడు లక్షాధికారి అయినాడు. పుత్రపౌత్రాభివృద్ధితో సకలైశ్వర్యములతో తులతూగుతూ సుఖంగా వుంటున్నాడు. అయినా గర్వించక కడు నిరా డంబరంగా జీవితాన్ని నెరపుతున్నాడు."

బాబాలీలలను వివరిస్తూ ఆయన మరికొన్ని ఉదంతాలను ఇలా చెప్పారు:

"ఒక సారి నేను కారులో ప్రయాణం చేస్తున్నాను. మా కారు ముందు మరొక కారు పోతున్నది దారిలో ఒక ఫకీరు మా కారుకు అడ్డంగా వచ్చి ఆపు చేశాడు. ఒక పావలా యివ్వు అని నన్ను అడిగాడు. నేను సంకోచించ కుండా పావలా యిచ్చాను. వెంటనే అతడు ఆ నాణెమును నోటిలో వేసుకొని మ్రింగివేసి ఇక వెళ్ళండి అన్నాడు. మేము బయలు దేరాము. కొంత దూరం పోయేసరికి మాకు ముందు పోయిన కారు ప్రమాదంలో చిక్కుకొని దానిలోనివారు గాయపడి వుండడం మేము చూచాము. బాబా ఆ ఫకీరు రూపంలో వచ్చి మాకారును ఆపి ఆలస్యం చేయించకపోతే మా కారు కూడా ప్రమాదానికి గురి అయి వుండేది కదా! బాబా తన భక్తులపై ఈగ నైనా వ్రాలనివ్వడు.

"ఓ సారి ఒక పేద బ్రాహ్మణుడు నా వద్దకు వచ్చి తన కష్టాలను చెప్పుకొన్నాడు. 'భయం లేదు వెళ్లు. బాబా యాచకుని రూపంలో నీ యింటికి వస్తాడు. అతనికి పీకు కలిగినది యిచ్చి పంపు. నీ కష్టాలు తొలగిపోతాయి." అని చెప్పాను. కొన్నాళ్ళకు వారి యింటికి ఒక బిచ్చగాడు వచ్చి 'ఆకలవుతున్నది. ఏదైనా పెట్ట'మని కోరాడు. నేను చెప్పిన మాటలు మరచి పోయిన ఆ బ్రాహ్మణుడు బిచ్చగానికి కపిలి దానం చేశాడు. కాని [illegible] పీఠకి [illegible] మా [illegible] జ్ఞాపకం వచ్చి [illegible] ఊరి [illegible] ఒక చోట ఆ [illegible] ఇంటికి [illegible] వచ్చి అన్నం [illegible]. భిక్షకుడు సంతృప్తుడై దీవించి వెళ్ళిపోయాడు. అప్పటినుండి ఆ బ్రాహ్మణుడు కష్టాలన్నీ తొలగిపోయి సుఖంగా వుంటున్నాడు. ఇప్పటికీ అతడు నా దర్శనానికై వస్తూ వుంటాడు."

భారతీయ సంస్కృతి ఔన్నత్యాన్ని గురించి ఖండ ఖండాంతరాలలో చాటి చెప్పిన వివేకానందస్వామిని గురించి, అహింసాస్త్రంతో బ్రిటిష్ సామ్రాజ్య రాక్షసిని పారద్రోలి మనకు స్వాతంత్ర్యాన్ని సముపార్జించిన రామ భక్తుడు గాంధీమహాత్ముని గురించి స్వామీజీ తరచు ఆసక్తి దాయకంగా చెబుతూ వుంటారు.

ప్రతిఫలా పేక్షారహితంగా విధ్యుక్త ధర్మాన్ని నిర్వ ర్తించా లంటారు స్వామీజీ. చిత్తశుద్ధితో పని చేసేవారికి ఎదురుండ బోదంటారు. పేదలను ప్రేమతో ఆదరించా లంటారు. పుణ్యకార్యాచరణంతో ఉన్నత గతికి సోపా నాలు నిర్మించుకోవా లంటారు. దైవధ్యానం అన్నింటి కంటె ముఖ్యమంటారు.

షెనాయ్‌నగర్ (మద్రాసు) లోని సాయిమందిరంలో స్వామి కేశవయ్యాజీ ప్రతి గురువారం ప్రత్యేకంగా చేసే సాయి పూజలను కన్నుల విందుగా దర్శించి తీర్థ ప్రసా దాలను స్వీకరించడానికి వేలాదిమంది భక్తులు వెడుతూ వుంటారు. షిర్డీలో ఉన్నది సాయిబాబా. అది పీఠమైతే, షెనాయ్ నగర్‌లోనిది అనుబంధ పీఠం. సాయి పూజార్థం వచ్చే భక్తుల సంఖ్య ఎక్కువై పోతున్నందున ఆ సమ యంలో వారు ఆరుబయట వేచివుండ నవసరం లేకుండా సదుపాయం కల్పించడానికై అక్కడ ఇప్పుడు బ్రహ్మాండ మైన సాయిమందిరాన్ని నిర్మిస్తున్నారు. దాని నిర్మాణ వ్యయానికై యథా శక్తి విరాళాలు పంపవలసిందిగా సాయి సమాజ నిర్వాహకులు భక్తులకు, అభిమానులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

"నీ పాదకమల సేవయు
నీ పాదార్చకులతోడి నెయ్యమును నితాం
తాపార భూతదయయును
తాపసమందార నాకు దయసేయగదే!"

(ఆంధ్రప్రభ సౌజన్యంతో)

కర్ణాటక సంగీత పితామహుడు భక్త పురందర దాసు

శ్రీ వేదం రామశాస్త్రి

కృపాసిద్ధులు సాధన సిద్ధులు అని రెండు విధాలు. భగవానుని సిద్ధి నొందిన వారు కృపా సిద్ధులు సాధన చేసి సిద్ధి నొందినవారు సిద్ధులు. ఐహిక పరులుగ నుండి ఉన్న ట్లుండి భగవత్పరులుగ మారుట. . అనే పరివర్తన మాన వుల జీవితంలో అత్యంత ప్రాముఖ్యం వహించింది. వివిధ దేశముల చరిత్ర పరికిస్తే భగవత్కృపచే హఠాత్‌సిద్ధి నొందిన యోగులు, యోగినులు అనేక మంది కన్పిస్తారు. ఇట్టి మార్పులలో అంతస్తు లున్నాయి. ఇం దనేకమంది యోగులు భగవంతుని తమ ప్రాణనాయకునిగా భావించి, తమ్ము నాయికలుగను తలచి వారి హృదయభావాన్ని తీర్చు కుంటారు. ఇది వారి రచనలను స్వీయచరిత్రలను పరికిస్తే గోచరించే విషయం. పరివర్తన అనేది ఒక్కొక్కరికి కొంత కాలం పడుతుంది. 'పాల్' 'అగస్టిన్' 'జాన్ బని యన్' మొదలైన వారి చరిత్రలు గమనిస్తే వారి మార్పుకూ దీర్ఘమైన పూర్వ దశలున్నాయని తెలుసుకో వచ్చు.

ఆకస్మిక పరివర్తనము చెందిన వారిలో మన దేశమున కో కొల్లలు. వాల్మీకి, బుద్ధుడు, అశోకచక్రవర్తి, వేమన, బిల్వమంగళుడు, మాధవ దేవుడు, చేలప్పెరుంబునంబూద్రి, వామ దేవుడు, కాన్హో పాత్ర, తుకారాముడు, రామదాసు, నరశాదాసు, విలయత్రాయస్వామి, స్వామి జీవత్ సింగ్, ధనుర్దాసుడు, పట్టినత్తారు, చైతన్యుడు, తులసీదాసు— మున్నగు మహనీయుల కోవకు చెందినవాడే—కర్ణాటక యోగి పురందర దాసున్ను.

పురందరుని పూర్వ నామం కృష్ణప్ప నాయకుడని కొం దరు, శ్రీనివాస నాయకుడని కొందరు అంటున్నారు. ఈ పేరు మాత్రం సందిగ్ధంగా ఉంది. ఒకరికే రెండు పేర్లు ఉండినా ఉండవచ్చు.

ఈయన పదునైదవ శతాబ్దం ఉత్తరార్థంలో - పూనాకు పధునెనిమిది మైళ్ళ దూరమున గల 'పురంధరగడ' లో క్రీ. శ. 1484 లో జన్మించాడు. ఇతని తండ్రి వరదప్ప నాయకుడు. తండ్రి వలె ఇతనూ కన్నడభాషలో గొప్ప పండితుడు. చిన్ననాడే చక్కగా విద్యల నేర్చినాడు. పద హారు సంవత్సరములు నిండాయి. ఒక కన్యనిచ్చి వివా హము చేసినారు. తండ్రి వలె ఇతడు పరంపరాగతమైన రత్నముల వ్యాపారము చేయుచు అపారమైన ధనాన్ని సంపాదించినాడు. అతని తండ్రి లోభి. ఇతడూ తండ్రి కంటే పరమ లోభి. లుబ్ధాగ్రేసర చక్రవర్తి. కాని వ్యాపా రములో గొప్ప నేర్పరి. హంపీ (విజయ నగరము), గోల్కొండ మొదలైన చోట్లకు వెళ్ళి రాజులకు రత్న,మాణి క్యాలను అధికమైన వెలకు విక్రయించి ఎక్కువ ధనాన్ని సంపాదించి 'నవకోటి నారాయణు'డని పేర్గాంచినాడు.

ఆయన యోగిగా పుట్ట లేదు. వైరాగ్యం అంటే అతని హృదయంలో సంక్షోభం కలిగిస్తుంది. దేవుడే భక్తిప్రచా రానికై అతణ్ణి వరించాడని చెప్పుకుంటారు. అతడు దేవుణ్ణి వెదక లేదు దేవుడే అతణ్ణి వెదుక్కొని వచ్చినాడు.

ఈయన కర్ణాటక సంగీతానికి ప్రారంభకు డంటారు. కన్నడ భాషలో వేలకొలది కీర్తనలను, ప్రజానీకాన్ని సంబోధిస్తూ—వ్రాశాడు. వారికి ఆధ్యాత్మిక నైతిక చైతన్యం కల్గించునవై ఉన్నవి. ఈగాయక శిఖామణి గేయములు ఆయన బుర్రనుండి పుట్టినవి కావు. సహచరుల ప్రేమచే కొట్టు కొను హృదయపు లోతులనుండి పుట్టినవే.

శ్రీనివాస నాయకుని లోభత్వం పిసినారితనం నానాటికీ హెచ్చుతున్నవి. రత్నవర్తకమే గాకుండా వడ్డీ వ్యాపారం కూడా ప్రారంభించాడు. వడ్డీని రాబట్టుకోడంలో అత డొక 'షైలాక్', లేదా నక్షత్రకుడు. క్రూరంగా కూడా ప్రవ ర్తించేవాడు. చింపి గుడ్డలు ధరించేవాడు. ప్రాణాల్ని నిలుపుకోడానికి కావలసిన ఆహారాన్ని మాత్రమే భుజించే వాడు. ఒక్క కానీ వదలుకొనుటకంటె అతడు ప్రాణా

నైనా వదులుతాడు. ఎవరైనా బిచ్చమడిగితే మహా బాధతో మూలుగుతాడు. అట్టి సుగుణాలతో ఉండే శ్రీనివాస నాయకుణ్ణి చూచి ప్రజలు అసహ్యించుకునేవారు.

అతనియందు గాఢ ప్రేమ కలిగి ఒక ప్రాణియే. ఆమె అతని భార్య సరస్వతీబాయి. మంచి శీలవతి. పరోపకారి. భగవంతునందు మహా భక్తి. దానం చేస్తామంటే ఆమె దగ్గర ఒక్క కానీ ఉండదు. భర్త పిసినిగొట్టు తనపూర్వ ఫలమిది అనుకొని మనో వ్యధను మౌనంతో అనుభవిస్తూండేది.

శ్రీనివాసుని పరివర్తనకు రెండు సంఘటనలు కారణాలున్నాయి. ఒక పండుగనాడు భీమానదిలో (చంద్రభాగా నది) స్నానం చేయుటకు తప్పని సరిగా పోవలసి వచ్చింది. అక్కడ పూజ చేసినప్పుడు బ్రాహ్మణులకు దక్షిణ ఇవ్వటం అనివార్యమైన ఆచారం. ఇది ఇతనికి పరిశోధనమే. దక్షిణకై రూక లిస్తే తాను బ్రతుకనని తలంచాడు, పెట్టె నంతా గాలించి, చివరికి అరిగిపోయిన రాగి నాణాన్ని పట్టుకొచ్చాడు. భార్యా సమేతుడై, నదిలో చాలాదూరం ఘట్టమునకు పోయి స్నానం చేశాడు. వెను దిరిగి వస్తుంటే వృద్ధబ్రాహ్మణ యాచకుడు ఎదురయ్యాడు. చేత నున్న అరిగిపోయిన రూకను ఇవ్వవలసి వచ్చెనే అని మహా బాధపడ్డాడు. ఇంతలో యుక్తి తోచిం దతనికి. ఎవ్వరికీ అగపడకుండా తన చేతనున్న అరిగిపోయిన నాణాన్ని క్రింద వేసి పాదాలతో త్రొక్కి పట్టాడు. పైకమంతా పోగొట్టుకున్నానని బిగ్గరగా అరిచాడు. వెదికేటట్లూ, ఏమీ కనబడనట్లూ, అభినయించాడు. బహిరంగంగా విలపించాడు. విప్రుడు విస్మయంతో వెళ్ళిపోయాడు. అతని భార్య పడుతున్న బాధ వాగతీతం. విశేషమైన దినాల్లో కూడా తన భర్త పిసినిగొట్టుగా నున్నందుకు అవమానంతో తల వంచుకొన్నది. ఇది ఒక సంఘటన.

మరొకటి:

ఒక బ్రాహ్మణుడు తన కొడుకు ఉపనయనంకొరకు ధనసహాయం కోరుతూ శ్రీనివాసుని వద్దకు వచ్చాడు. 'సరే రేపురా మాపురా' అని ఆరు నెలలు త్రిప్పించాడు. ఫలితం కనబడలేదు. తుదకు శ్రీనివాసుడే లొంగవలసి వచ్చింది. ఒక ధన పేటికను తెరచి నాణేలనంతా ప్రోగు పోశాడు ఒక చోట. బ్రాహ్మణుడు సంతోషించాడు. కానీ ఆ సంతోషం చాలాకాల ముండ లేదు. ఎందు కంటే ఆ నాణాలన్నీ అరిగి పోయాయి. ఆ రాశిని పూర్తిగా తీసుకోటానికి అనుమతి లేదు.

"స్వేచ్ఛగా ఈ రాశినుండి ఒక్క నాణాన్ని ఏరి తీసుకో" అన్నాడు శ్రీనివాసుడు. బ్రాహ్మణుని హృదయం క్రుంగిపోయింది. విసుక్కున్నాడు. వెదకి చూశాడు. అయితే లభించలేదు.

ఆ బ్రాహ్మణునికి ఒక యుక్తి స్ఫురించింది. 'వాకిటి గుండా సాధించుకో లేనిదానిని వాకిట్లో సాధించుకో వచ్చునని', అతడు సరస్వతీబాయిని సమీపించాడు. తన సంగతి అంతా చెప్పుకున్నాడు. ఆమె తనయొక్క దుఃస్థితి నంతా స్మరించుకొంది. వెంటనే తన ముక్కు పుడకను అతని కిచ్చివేసింది. ఆ బ్రాహ్మణుడు దాన్ని తీసుకొని పోయి శ్రీనివాసుని అంగట్లోనే అమ్మజూపాడు. తన భార్య ముక్కుపుడకను చూచి ఆశ్చర్యపడ్డాడు. ఆ నగకు ముద్ర వేసి పెట్టెలో పెట్టాడు. ఇంటికి వచ్చాడు. భార్యను పిలిచి ఆమె బోసి ముక్కును చూచి "సర్వ నాశనం చేస్తున్నావే, ముక్కుపుడకను ఏం చేశావు" అని అరిచాడు.

సరస్వతీబాయి మూర్ఛిల్లినది. ముక్కుపుడకను ఇచ్చి గాని ఇచ్చితి నన్నచో తన ప్రాణాలు తీయబడతాయని ఆమెకు తెలుసు. చాలా సేపు యోచించింది. చివరకు 'పుడక విరిగి పోయింది. ఇంట్లో పెట్టి యున్నా'నని అబద్ధమాడింది.

శ్రీనివాస నాయకుని సందేహాలు తీరాయి. ఆమె బుద్ధి పూర్వకంగా పుడకను ఇచ్చి వేసింది. నాయకుడు దీని అంతుపొంతూ కనుక్కోవలెనని చూశాడు. గట్టిగా "సరస్వతీ! నీకు ప్రాణాలపై ఆశ ఉంటే దాన్ని వెంటనే తీసుకురా" అని అరిచాడు. లోపలికి వెళ్లింది. తలుపు గడియ పెట్టుకుంది. దారీ తెన్నూ తెలియ లేదు. విషం కలుపు కొంది గిన్నెలో. ఆమె సర్వేశ్వరునితో "ఒక విప్రుడి సత్కార్యమునకు తోడ్పడుటకై నేను ఆ విధంగా చేశాను. అది నా పతికి అప్రీతికరం. పతియూ దైవమే కదా! నా దేహప్రాణాలను నీ కర్పిస్తా.' ఆమె దాన్ని త్రాగనుండగా ఆ గిన్నెలో ఆ పుడక ప్రత్యక్షమైంది. ఆమె ఆనందపరవశమైంది. 'ఆ ముక్కు పుడకను చూపలేని ఆమెను చంపవలసిందే' అని తీర్మానించుకొని అటు యిటు పచారు చేస్తున్నాడు నాయకుడు. ఆమె వచ్చింది. పుడకను తెచ్చింది. అతడు పరమాద్భుతంగా వివశత చెందాడు. వెర్రెత్తిన వాని వలె అంగడికి పరుగెత్తి పోయాడు, పెట్టెను తెరిచాడు. అక్కడ అది లేదు. ఆయనకు బోధ పడింది. ఆరునెలలు ప్రతిదినం తన గడపనెక్కి వచ్చుచున్నవాడు సర్వేశ్వరుడే అని అప్పటికి తెలుసుకొన్నాడు. భగవత్సంకల్పానికి తన్ను అర్పించు కొన్నాడు. ఆనాటి రాత్రే అతని జీవి

తంలో మార్పు వచ్చింది. ''మోసహోదనల్లో' (అన్నా) ఇంత కాలం దేవుణ్ణీ తెలుసుకోకుండా మోసపోయాను కదా!) అనే కీర్తన మొట్టమొదట అతని హృదయము నుండి వెలువడినది.

మరునా డుదయాననే లేచాడు. కాలకృత్యాలు తీర్చుకున్నాడు. ఆ పురంధరగడలో ఒక మహాద్భుతం జరిగింది నాడు. ధనం, నగలు, వస్త్రములు, ధాన్యం—దానులనుపిలిపించి పంచిపెట్టాడు. భార్య ఒక పైస కూడా మిగల్చలేదు. గృహమంతా శోధించాడు. భార్య స్వాధీనంలో ఉన్న బంగారు బరిణెతో సహా ధర్మం చేశాడు.

అక్కడినుండి పాదచారియై పండరీ పురం చేరాడు. చంద్రభాగానదిలో స్నానం చేయటం శ్రీ విఠలనాథుని త్రికాలములలో సేవిస్తూ, భిక్షాటనతో ఉదరపోషణ చేసుకుంటూ పండ్రెండు సంవత్సరములు భగవంతుని ఆరాధించాడు, ఇంతలో ఆ ప్రాంతంలో మహమ్మదీయుల హింసాకాండ అధిక మైంది. అందువల్ల హంపీ విజయనగరానికి నాయకుడు చేరాడు. శ్రీకృష్ణరాయలను దర్శించినాడు. ఇతణ్ణి చూచి ఆశ్చర్యపోయాడు. తన అప్పటి స్థితినంతా రాయలకు వివేదించినాడు.

వ్యాస (తీర్థ)రాయస్వామిని (క్రీ. శ. 1478-1539) సాళువ నరసింహరాయలనుండి అచ్యుత రాయలవరకు ఆదరించిన వారే. వీణావాదనమున తనకు గురువైన వ్యాసరాయరును పిలిపించి,తనకు మిత్రుడైన శ్రీనివాస నాయకునకు మంత్రోపదేశ మిప్పించాడు—శ్రీ కృష్ణదేవరాయలు. ఆ యతీశ్వరుడు పురాణములను సాంగోపాంగముగా నేర్పి శ్రీనివాస నామమును 'పురందర విఠలుడు'గా నామకరణం వెలువరించినాడు.

వ్యాసరాయల శిష్యులలో పురందరుడు భక్తుడు. వారి రాజు కవి. పురందర దాసులో ప్రగాఢమైన భక్తి అభివృద్ధి చెందించి, భిక్షాటన చేస్తూ, జీవనాన్ని గడుపుతూ భగవచ్చరణములను సేవిస్తూన్న దాసు డొక్కడే అని తన గీతాల్లో వ్యాసరాయరు వర్ణించి యున్నారు. సుమారు 4,75,000 కృతులు వివిధ రాగాలలో రచించి యున్నాడు. వానిలో కొన్ని మాత్రమే లభ్యములు. ఇప్పటికీ అముద్రితంగా ఎన్నో తెలుగు లిపిలో తాళపత్రములలో తంజావూరు సరస్వతీ మహాలు పుస్తకభాండాగారమున నిక్షిప్తములై యున్నవి.

ఆనాటి సమకాలీన సాహిత్యాన్ని పరికిస్తే ప్రబంధ కవులలో ప్రసిద్ధుడైన రామరాజ భూషణునిపై కూడా పురందరుని సంగీత ప్రభావం సోకిందా అనిపిస్తుంది కొన్నిచోట్ల.

తెనాలి రామలింగడు—రామకృష్ణుడై, ఉద్భటారాధ్య చరిత్రను వ్రాసి తాతాచార్యులను ఉడికించి తర్వాత వయస్సు భక్తి ముదిరిన తర్వాత పాండురంగ మాహాత్మ్యాన్ని వ్రాసినాడు. ఈ పాండురంగ మాహాత్మ్యం వ్రాయడానికి, పురందరుని పండరిపుర భక్తి ప్రచారం ఇతనిపై కూడా సోకిందేమో! చరిత్రకారులే నిర్ణయించవలసి ఉంది.

వ్యాసతీర్థులు మాధ్వసాంప్రదాయ యతి. పురందర దాసున్నూ దీక్ష వహించి మధ్వమత సిద్ధాంతములను వ్యాపింపజేస్తూ పలుకీర్తనలను రచించి యున్నాడు.

పురందరునకు లౌకిక దుఃఖ శృంఖలములు విడిపోయినవి. భగవదనుగ్రహ ప్రాప్తి ప్రాప్తించింది. తన్మయత్వము చెంది అంటున్నాడు.

'బదుకెదెను బదుకెదెను భవహింగితు
పదుమనాభ పాదదొలుమె ఎనగాయ్తు'—

''బ్రతికిపోయాను, బ్రతికిపోయాను—భవము నాశమయింది. పద్మనాభుని (పరమాత్ముని) పాద భక్తి నాకు దొరికింది'' అని.

తన్ను సంస్కరించి తన కొరక పవిత్ర మార్గాన్ని చూపించిన వ్యాసతీర్థులను

''ఎన్నో జన్మముల సుకృతఫలం దొరికింది
వ్యాసరాయల చరణ కమలముల దర్శనమువల్ల
కులకోటి పావన మయింది—
శ్రీ వల్లభుని భజించుటకు అర్హత కలిగింది—'' అని స్తుతించాడు, పురందరదాసు. దంభాచారములను కటువుగా విరసించాడు, పురందర దాసు. 'పదుమనాభ నలివేసభకుతి యిల్లద వైరాగ్యఉదర వైరాగ్య వల్లదెమ త్తేను'—భగవంతుని ఎడ కొంచెమైనా భక్తిలేని వైరాగ్యం ఉదర వైరాగ్యం అంటా డాయన.

అంతే కాదు—

'తనుక నీరొళగద్ది ఫలవేను
మనదల్లి దృఢభక్తి యిల్లద మనుజరు'

మనసులో దృఢభక్తి లేని మనుజులు దేహమును నీటిలో ముంచితే మాత్రం ప్రయోజన మేమిటి? అని ప్రశ్న వేసి—దానికి వివరణగా—

'నేనుమ్మ బదువుదే ముక్తి' (ఊరకే కలుగునా ముక్తి) అని ప్రారంభమగు కీర్తనలో

'మనదల్లి దృఢవిదచేతు

జనరసంసర్గవ సీగలుబేకు
అనుమాన వనుబిడబేకు—
తన్నమనవ శ్రీహరిగె ఒప్పిసబేకు
వ్యాపారవను బిడబేకు—
పాపరహిత నాగబేకు
జ్ఞానదాపద బెళకినలి ఒడ్యాడబేకు''—

'మనస్సులో దృఢ ముండాలి. జనుల సంసర్గం విడవాలి. అనుమాన ముండకూడదు. తన మనసును శ్రీహరి కర్పించాలి. వ్యాపారం వదులుకోవాలి. పాపరహితుడు కావాలి. జ్ఞానదాహపు వెలుతురులో నడవాలి:—అని ఉపాయం చెప్పారు.

పురందరుని దృష్టి విశాల మైనది. ఆయనకు కలిగిన పరివర్తనలో మతసిద్ధాంతముల భేదముల ప్రసక్తియే లేదు. లౌకిక దుఃఖశృంఖలములు వీడిపోయి భగవదనుగ్రహ ప్రాప్తియే—అ పరివర్తన సారాంశం.

పురందరుని పదాలను పరిశీలిస్తే నాటి సమాజ జీవితం దర్పణములో బింబంలా గోచరిస్తుంది. వేమనవలె సమాజంలో ఉండే అనీతి నంతా చక్కగా చిత్రించాడు. తను చివరి దశవరకూ హంపీవిజయ నగరంలోనే ఉండి సన్న్యాసము స్వీకరించి పుష్య బహుళ అమావాస్య మంగళవారం జనవరి 2.1564 సంవత్సరమున భగవత్సాన్నిధ్యం చేరాడు పురందరుడు. ఇది ఇప్పటికి జరిగి నాలుగువందల సంవత్సరాలపైన ఐంది.

పురందరునికిగల తత్త్వజ్ఞానం, భగవద్భక్తి అవ్యాజమైనవి. భక్తిప్రచారమునకు ఆయన పాడిన మధురగేయాలు విశ్వజన హృదయాకర్షకములు. అవే అతనికి అజరామర కీర్తిని తెచ్చాయి.

భగవద్భక్తుల గుణం, వైభవం, కీర్తనం ఎంతచేసినా తృప్తి తీరదు. అట్టి గుణ కీర్తనం చేసిన వారే ధన్యులు. భగవత్సాన్నిధ్యం భక్తుల ద్వారానే కలుగుతుంది. అజ్ఞానాంధ కారంలో చరించే మానవతతికి ఇట్టి వారే దివ్య జ్యోతులు. అట్టి జ్యోతులలో పురందర దాసొకడు. అందుకే త్యాగరాజువంటి భక్తుడుకూడా.

'దురిత వ్రాతము లెల్లను
పరిమార్చెడి హరిగుణములఁ బాడుచు నెపుడున్
పరవశుడై వెలయు పురం
దరదాసుని మహిమలను తలచెద మదిలోన్'

అని అన్నాడు ప్రహ్లాద భక్త విజయంలో.

అందుకే కన్నడ దేశంలో 'పురందరదాసు ఒక్కడే దాసుడుగాని ఇతరులు దాసులు కారని' (దాసరేందర దాసరయ్య పురందర దాసర) ఒక లోకోక్తి కూడా బహుళంగా వ్యాపించింది.

పురందరుని జీవితమే తత్త్వమయమైంది. శాస్త్రాధ్యయనం, వాక్యార్థం, శుష్కకర్మలతో భగవంతుడు ప్రీతి చెందడు. ముక్తి లభించదు. అంతఃశుద్ధి, హృదయ పరిపక్వం-అత్యవసరం దేవుని దర్శించుటకు. దేవుణ్ణి దర్శించటానికి—తిరిగి తిరిగి అలసి పోనక్కరలేదు. మాటలు నేర్వ నక్కర్లేదు. గ్రంథాలు తిరగేయ నక్కర్లేదు—ఈ విస్పారమైన నిష్ఠలను తెగ ఖండించాడు.

అట్టి పురందరుడు, గురువుగా, దాసశ్రేష్ఠుడుగా, దయానిధిగా, పేర్గాంచాడు. ఆయన అనుదినం ప్రార్థించి పునీతమైన ఆ పాండురంగ విఠలుని మనమూ ప్రార్థిద్దాం:

'భీమాతీర నివాసాయ
పండరీపుర వాసినే
పాండురంగ ప్రకాశాయ
విఠలాయ నమోనమః'

'పలు తీర్థంబులఁ గ్రుంకుకంటె మహిలో భక్తాంఘ్రి పాపీయముల్
తలమీఁదన్ జికిలించుకోదగును......................'

— యాథావాక్కుల అన్నమయ్య

'సద్గురువు కృప ఒక్కటే ఇహ, పర లక్ష్యాల సాధనకు సులభమార్గం'

శ్రీ 'సత్యాన్వేషి'

భౌతిక, ఆధ్యాత్మిక లక్ష్యాలను సాధించడానికి ప్రతి ఒక్కరికీ ఏదో రూపంలో గురువు అవసరమన్న సత్యాన్ని విజ్ఞతగల ప్రతి ఒక్కరూ అంగీకరించడం తథ్యం. భౌతిక లక్ష్యాల సాధనకంటె, ఆధ్యాత్మిక లక్ష్యాల సాధనకు అనువైన సద్గురువు లభించడం దుర్లభం. ఆత్మ సాక్షాత్కారాన్ని పొందిన సద్గురువు ఒక్కడే జీవిత లక్ష్య సిద్ధికి తోడ్పడ గలుగుతాడు. వశిష్ఠుడు, సాందీపని మహర్షులను గురువులుగా స్వీకరించి రాముడు, కృష్ణుడు వంటి అవతార మూర్తులు కూడా కృతార్థులైన విషయాన్ని గుర్తించక తప్పదు. అట్టి సద్గురువుల కోవకు చెందిన మహనీయుడు షిర్డీ సాయిబాబా అన్న యథార్థతను ఆ మహిమాన్విత జీవితాన్ని తరిచి చూచిన వారికి బోధపడక మానదు.

ఒక సారి కాకాసాహెబ్ దీక్షిత్ అనే భక్తుడు షిర్డీలో సాయిబాబాను ''మీరు షిర్డీ వదలివెడతారా?'' అని ప్రశ్నించాడు. అవునని బాబా అనగానే, ఎక్కడికి అని మరొకరు ఆత్రతతో అడిగారు. మహోన్నతస్థలికి అని బాబా అన్నారు. అక్కడకు మార్గం ఏది అని ప్రశ్నించగా, ''అక్కడకు అనేక మార్గాలున్నవి. ఇక్కడనుంచి (షిర్డీ) ఒక మార్గం ఉన్నది. అతి క్లిష్టమైన మార్గం. మార్గమధ్యంలోని అడవులలో పులులు, తోడేళ్ళు ఉన్నవి'' అని బాబా చెప్పారు. 'ఒక మార్గదర్శకుడు ఉంటే కష్టమేమిటి?' అని వెంటనే కాకాసాహెబ్ అడిగారు. 'అప్పుడు పరవాలేదు. పులులు, తోడేళ్ల బారిపడకుండా ఆ మార్గదర్శకుడు సరాసరి గమ్యస్థానానికి చేర్చగలడు. అట్టి వ్యక్తి లేనప్పుడు అడవులలో దారి తప్పడమో, ఏ అగాధంలోనో పడిపోవడమో తప్పదు' అని బాబా ఒక హెచ్చరిక చేశారు.

భౌతిక రంగంలో కంటె, ఆధ్యాత్మిక రంగంలో లక్ష్య సాధనకు సద్గురువు అవసరం ఎంతైనా కలదన్న విషయం సాయిబాబా పై వాక్యాలవల్ల తేటతెల్లమౌతుంది. ఇహ, పరసుఖాలను, లక్ష్యాలను సాధించడానికి, నట్టేట నావను నడుపుతూ భద్రంగా, సునాయాసంగా ఒక ఒడ్డుకు చేర్చగల ఉత్తమ నావికుడు సద్గురువు. అట్టి సద్గురువు స్పర్శమాత్రాన, కృపమాత్రాన ఎన్ని జన్మల పాపాలైనా పటాపంచలమౌతవి. ఆత్మజ్ఞానం, మానసిక శాంతి సమకూరుతుంది. ఇహ, పరసుఖాలు కరతలామలకమౌతవి. మతసంబంధమైన ఉపన్యాసాలు వినడం ద్వారాగాని, మతగ్రంథాలు చదవడం ద్వారాగాని మనం సాధించజాలని జీవిత లక్ష్యాన్ని, మహనీయుల సాంగత్యం, కృపద్వారా సాధించడం తేలికవుతుంది. నక్షత్రాలన్నీ కలిసినా ఇవ్వలేని కాంతిని సూర్యుడు ఎలా ఇవ్వగలడో, అలానే పవిత్ర మతగ్రంథాలు, సూక్తులు కలుగజేయలేని ఆధ్యాత్మిక జ్ఞానాన్ని, ఆత్మసాక్షాత్కారాన్ని సాధించడంలో తోడ్పడమే కాక, జీవన సమస్యలను సద్గురువు తన కృపద్వారా క్షణంలో పరిష్కరించడం కూడా తథ్యం. ఇందుకు పెక్కు దృష్టాంతరాలు సాయిబాబా జీవిత విశేషాలలో మనకు గోచరిస్తాయి. భీమాజీ పాటిల్ అనే వారు రొమ్ముజబ్బుతో మరణ బాధపడేవారు. చివరకు క్షయగా మారింది. ఎన్ని చికిత్సలు చేసినా ప్రయోజనం లేకపోయింది. బాబా భక్తకోటిలో ఒకరైన నానాసాహెబ్ చందార్కర్‌తో ఆయన సంప్రతించి షిర్డీకి వెళ్ళారు. పూర్వ జన్మ దుష్కర్మ ఫలితంగా ఈ బాధపడుతున్నావని, తానేమీ చేయ వీలుకాదని బాబా మొదట్లో అన్నారు. ఆ రోగి బాధ భరించలేక బొబ్బలు పెడుతూ బాబా కృపకై ప్రార్థించాడు. బాబా హృదయం కరిగి ''ఇక ఆందోళన పడకు. నీ కష్టాలు అంతిమ దశకు వచ్చినవి. ఇక్కడ కాలుపెట్టిన వారికి సుఖం తప్పదు. ఈ ఫకీరు చాలా కరుణార్ద్ర హృదయుడు. రోగాన్ని నివారింపజేసి, అందరినీ ప్రేమతో, వాత్సల్యంతో కాపాడుతాడు'' అని అన్నారు. ఆ క్షణంనుంచే ఆ రోగి పరిస్థితి మారిపోయింది. ఆ తర్వాత అతని రోగం పూర్తిగా పోయింది. కులాసాగా ఇంటికి తిరిగి వెళ్ళాడు.

ఒక సారి శ్రీమతి రాధాబాయీ దేశ్‌ముఖ్ అనే వృద్ధ మాత షిర్డీకి వచ్చి బాబానుంచి ఉపదేశం పొందాలనే సంకల్పంతో ఉపవాస దీక్షను ప్రారంభించింది. బాబా తన వద్దకు పిలిపించి తనకు ఒక గురువు ఉన్నాడని చెబుతూ ఆయన తన కేమీ ఉపదేశంకాని, మంత్రంకాని బోధించ లేదని. ఆయన నన్ను రెండు పైసలు దక్షిణ ఇమ్మని కోరారని, మొదటి పైస పరిపూర్ణ విశ్వాసం, రెండవ పైస ఓరిమి, క్షమ. ఈ రెండిటితోనే తన గురువు తృప్తి పడ్డారని, అటువంటి పరిస్థితి అవసరమని చెబుతూ గురు కృపావీక్షణంతోనే సుఖశాంతులు కలుగుతువని, మంత్రానికిగాని, ఉపదేశానికిగాని యత్నించ నక్కర్లేదని, త్రికరణశుద్ధిగా గురువును దృష్టిలో నిడుకొని యత్నిస్తే పరమార్థాన్ని నిస్సందేహంగా సాధించవచ్చుని ఆమెకు నచ్చజెప్పి, ఆమెచే కఠోరదీక్షను బాబా విరమింప జేశారు.

డాక్టర్ పిళ్ళె అనే బాబా భక్తుడు ఒక సారి కురుపుతో యమబాధపడుతూ ఉండే వాడు. "బాధ పడలేకుండా ఉన్నాను. మరణం వచ్చినా సంతోషమే. పూర్వజన్మకర్మ ఫలితమని తెలుసు. ఇప్పుడు బాధ తగ్గించి, మరి పది జన్మలలో అనుభవించేటట్లు చేయాలని బాబాను ప్రార్థిస్తున్నాను" అని కాకాసాహెబ్ దీక్షిత్‌తో అంటాడు. బాబాకు ఆ విషయం చెప్పగానే "భయపడ వద్దను. పది జన్మలలో ఎందుకు బాధ పడాలి? పది రోజులలో పూర్వ జన్మ కర్మ ఫలం అనుభవిం చెయ్యవచ్చు భౌతిక, ఆధ్యాత్మిక శ్రేయస్సును చూచే నేను ఇక్కడ ఉండగా, మరణానికై ఎందుకు ప్రార్థించాలి? ఇక్కడకు తీసుకురా. అతని బాధలను నివారిస్తాను" అని దీక్షిత్‌తో బాబా అంటారు. డాక్టరు రాగానే కూర్చోమని "పూర్వజన్మల ఫలితం అనుభవించక తప్పదు. సర్వకాల సర్వావస్థలయందు భగవంతుని స్మరిస్తే, ఆయనే కాపాడుతాడు. ఆత్మార్పణ బుద్ధితో ఆయన పాదాలకు మ్రొక్కి, ఆయన ఏమి చేస్తాడో చూడు" అని బాబా అన్నారు. "నీ కురుపుకు ఉన్న కట్టు తీసివెయ్యి. ఒక కాకి వస్తుంది. ముక్కుతో పొడిచి తీసేస్తుంది. దానితో నీ బాధ తగ్గుతుంది" అన్నారు. ఇంతలో మసీదు దీపాలు తుడిచే అబ్దుల్ వచ్చాడు. తలవని తలంపుగా అతని కాలు డాక్టర్ కురుపుమీద పడింది. దానితో ఆ కురుపులోంచి ఏడు నారి పురుగులు ఒక్క సారి బయటకు వచ్చాయి. క్రమేపీ బాధ తగ్గింది. పది రోజులలో పరిపూర్ణారోగ్యం చేకూరింది. ఇలాంటి ఘట్టాలెన్నో మనకు కానవస్తవి.

మరొక సద్గురువు శిష్యుడైన పంత్ అనే అతను ఒక సారి షిర్డీకి రావడం జరిగింది. మసీదుకు చేరగానే ఆయన మూర్ఛ వచ్చి పడిపోయాడు. బాబా కృపవల్ల తర్వాత స్పృహ వచ్చింది. అతను మరొక గురువు శిష్యుడని బాబా దివ్యదృష్టి ద్వారా తెలుసుకొని "ఏ పరిస్థితులలో కూడా నీ గురువును వదలకు. అతనినే నమ్ముకొని ఉండు. సర్వకాల సర్వావస్థలయందు ఆ గురువుపట్లే భక్తి ప్రపత్తులు కలిగి, పరిపూర్ణ విశ్వాసం ఉంచి జీవించు" అని ప్రబోధించగానే పంత్ ఆనందానికి అంతులేక పోయింది.

భక్తులపట్ల బాబా భావన ఎలా ఉండేదో ఈ వాక్యాలు స్పష్టపరుస్తవి. "సేవకులకు సేవకుడను. మీకు ఋణపడి ఉన్నాడను. మీ దర్శన భాగ్యంతో తృప్తి కలిగింది. మీ పాదాలను చూడగలగడం మహాభాగ్యం. నేను పురీషములో క్రిమిని. నేను చాలా అదృష్టవంతుణ్ణి." అటువంటి మహోన్నత స్థితి నందుకున్న సద్గురువు ఆ మహనీయుడు.

ఇలా ఈ మహనీయుని జీవిత విశేషాలలో పెక్కింటిని సోదాహరణంగా వివరిస్తూ బెంగుళూరులో శ్రీ సమాజంలో ఈ మాసారంభంలో జరిగిన సభలో, బెంగుళూరు సమీపానగల చెన్నపట్నంలో జరిగిన సభలో, వారిని ఇక్కడ మకాంలో దర్శనం చేసుకో వచ్చిన పెక్కుమంది భక్తులతో ప్రసంగ వశాత్తు షిర్డీ సాయిబాబా దూతగా పరిగణింపబడే మద్రాసు షెనాయ్ నగర్ శ్రీ సాయిబాబా భక్త సమాజ వ్యవస్థాపక అధ్యక్షులు స్వామి కేశవయ్యాజీ చెప్పిన అంశాలను మరి కొంత వివరంగా ఈ సమీక్షలో పొందుపరచడం జరిగింది.

భక్తునకు, శిష్యునకు గల తేడాను గురించి స్వామీజీ వివరిస్తూ బాబా సశరీరధారులై ఉన్న రోజులలో ఆయనకు సేవచేసి, ఆయన సాన్నిధ్యాన్ని ఉన్నవారు ఆ మహనీయుని శిష్యులని చెప్పుకొనే వీలున్నదని, మహాసమాధి అనంతరం చాలా కాలానికి 1939లో బాబా ప్రత్యక్షమై ఆ మహనీయుని కార్యక్రమాన్ని సాగించేందుకు నియుక్తుడనైన తాను బాబా భక్తుడను మాత్రమేనని నొక్కి వక్కాణిస్తూ ఉంటారు.

భక్త తుకారాం, భక్త ప్రహ్లాద, రామదాసు, జ్ఞానదేవ్ మున్నగు మహనీయులంతా మానవాళికి ఉత్తమ మార్గం చూపి తరింప చేయడానికి అవతరిస్తూ వచ్చారని, అట్టి మహర్షుల, మహనీయుల కోవకు చెందిన వారిలో షిర్డీ సాయిబాబా ఒకరని స్వామీజీ అంటారు. భక్తునికై ఎట్టి మహత్తర త్యాగానికైనా భగవంతుడు సిద్ధం కాగలడని నిరూపించే అనేక దృష్టాంతరాలు కలవన్నారు. ఆనాడు ఉగ్ర నరసింహావతారం వద్దకు ఎవరూ వెళ్లి శాంతింప జేయలేని స్థితిలో భక్త ప్రహ్లాదుడు ఒక్కడే ప్రార్థించి, ఎలా శాంతింప జేసింది గుర్తించా లన్నారు. భక్తులపట్ల

అట్టి అవ్యాజ ప్రేమ వాత్సల్యాలను భగవంతుడు చూపుతాడు. అదే రీతిగా భక్తులకై బాబా చేయని త్యాగం, పని లేదని పదేపదే చెబుతారు.

సాయిబాబా జాతి, మత, కుల, వర్గ, వర్ణభేదాలను, తరతమ భేదాలను పాటించేవారు కాదు. అందరిపట్ల సమభావంతో వ్యవహరించేవారు. వారి దూతగా వ్యవహరించే మహద్భాగ్యం కలిగిన స్వామీజీ తమను సందర్శించవచ్చిన వారిని ఆదరించి, ఆప్యాయతతో వారి కష్టాలను తీర్చడానికి బాబా కృపకై ప్రార్థిస్తూ అట్టి మహత్తర లక్ష్యంతో, మహోన్నత దృక్పథంతో పనిచేస్తున్నారన్న భావం వారిని సందర్శించిన ప్రతి ఒక్కరికి కలగక మానదు. ఒక రోజున బెంగుళూరులోని శ్రీ సాయిబాబా భక్తసమాజ ప్రముఖులతో ఇద్దరు ఆటోరిక్షా డ్రైవర్లు స్వామీజీ సందర్శనానికి వచ్చారు. వారిలో ఒకరికి ఆశీర్వచనాలతో పది రూపాయల నోటును ఇస్తూ "ఇది జాగ్రత్తగా ఉంచుకో. మళ్ళీ వచ్చే సంవత్సరం నాటికి స్వంతంగా ఆటోను సంపాదించుకొని, నడుపుకొంటావు" అని అన్నారు. రెండో అతనికి అయిదు రూపాయల నోటును ఇస్తూ "నీకు ఒక దురలవాటు ఉన్నది. అందుకు డబ్బు వెచ్చిస్తావు. ఈ నోటుని భద్రంగా ఉంచుకొని ఆ దురలవాటును మానుకుంటే, ఏడాది నాటికి నీవూ స్వంతంగా ఆటో సంపాదించుకొని సుఖంగా జీవిస్తావు" అని ఆశీర్వదించారు. ఇలాంటి సంఘటనలు కొల్లలుగా వుంటవి. స్వామీజీతో పరిచయం గల ప్రతి ఒక్కరి అనుభవాలు ఇందుకు భిన్నంగా ఉంటవనిగాని, షిర్డీ సాయిబాబా కృపకు పాత్రులు కావడానికి తరతమ భేదాలుగాని, జాతి, మత, కుల, వర్గ, వర్ణభేదాలుగాని అడ్డువస్తవనిగాని, వారి వారి ఇష్టదైవాలను, గురువులను విస్మరించి ప్రవర్తించవలసిన అగత్యం కలదనిగాని ఎవరూ తలపోయ వీలు కాదంటే అతిశయోక్తి ఏమీ లేదనిపిస్తుంది.

(ఆంధ్రప్రభ సౌజన్యంతో)

'హరిదాసులకు పూజ లాచరించిన బాలు
హరిని పూజ సేతునని యహ మదేటికే.'

— రామదాసు చరిత్ర

'ఆర్తజనోద్ధరణకే అవనిపై అవతరించిన అవధూత మూర్తి'

శ్రీ గుడిపాటి [illegible]కృష్ణ

"యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత ।
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్॥
పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్ ।
ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే॥"

అధర్మము, అసత్యము, [illegible] పెచ్చు పెరిగిపోతివో, అప్పుడు దుష్టశిక్షణ శిష్టరక్షణార్థం తాను అవతరిస్తూ ఉంటానని శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీతలో చాటిన విషయం అక్షరాలా నిజమని యుగయుగాలుగా నిరూపితమవుతూ వస్తున్న పరమ సత్యం. ఇక అనేక శ్లోకాలకు లోను అయి [illegible] జనోద్ధరణే ప్రధాన లక్ష్యంగా పరమేశ్వరుని [illegible] భువికి వచ్చే మహర్షులు, మహనీయులూ వ్యవహరిస్తూ [illegible] కాలను తరిచి చూచిన వారికి తేట తెల్లం కావడం తథ్యం. ప్రతి ఒక్కరూ ఆత్మసాక్షాత్కారానికై తీవ్రకృషి చేయడమే జీవిత పరమార్థమని ఉద్గ్రంథాలన్నీ ఘోషిస్తూ వస్తున్నవి. ఈ మహత్తర లక్ష్యసాధనకు జ్ఞాన, కర్మ, భక్తి మార్గాలను ఏనాడో పూర్వులు నిర్దేశించారు. అందులో జ్ఞానమార్గం కడు దుర్లభం. ఇక కర్మయోగం కూడా బహు కొద్ది మందికే సాధ్యం. నిరంతరం ప్రాపంచిక విషయాలలో మునిగి తేలుతూ ఉండే సామాన్యులందరికీ భక్తిమార్గం ఒక్కటే తరణోపాయంగా కనిపిస్తుంది. ఈ కలియుగంలో ఇంతకంటె మరొక ఉత్తమమైన, సులభమైన మార్గం లేదని విజ్ఞులు చెబుతున్నారు. ఈ యుగ ప్రభావం ఎటువంటిదో చూడాలంటే తెలుసుకో యత్నించడం సముచితమే నవిపిస్తుంది. కృష్ణ నిర్యాణ సమయంలో ధర్మరాజ తనకు పొడచూపిన దుర్నిమిత్తాలకు చింతిస్తూ—

సీ॥ ఒకకాలమునఁ బండునోషధీచయము వే
రొకకాలమున బండకుండునండ్రు
క్రోధంబు లోభంబుఁ గ్రూరత బొంకును
దీపింప నరులు వర్తింతు రండ్రు
వ్యవహారములు మహావ్యాజయుక్తములండ్రు
సఖ్యంబు వంచనా సహితమండ్రు
[illegible] లిల్లాండ్రు మెప్పరించెదరండ్రు,
[illegible] దెగజూతురండ్రు
తే॥ [illegible] కలహించి కూడరండ్రు,
[illegible] ఒరుగరండ్రు
[illegible] నడవరండ్రు.
[illegible] గంటె నేడు.

(మహా భాగవతం

అని భీమునితో అంటాడు. ఆ తర్వాత అర్జునుడు ద్వారక నుంచి వచ్చి కృష్ణనిర్యాణాన్ని గురించి చెప్పి చివరకు—"క॥ ఏదినమున వైకుంఠుడు, మేదినిపై దాల్చి [illegible] దా దినమున నశుభ్రవతి, పాదికమగు కలియుగంబు ప్రారంభంబయ్యెన్" అని అంటాడు. ఆ క్షణం లో ధర్మరాజు "సీ॥ కలిప్రవర్తనంబున గ్రౌర్యహింసాసత్య వంచకకోటి [illegible] ధర్మచయము పురముల గృహముల భూముల [illegible] దలపోసి....'' అని మనుమనికి రాజ్యం అప్పగించి మహా ప్రస్థానానికి వెళతాడు.

[illegible] ఈ యుగంలో భౌతికవాదం బాగా ప్రబలుతూ రావడం, ధర్మమార్గాలకు జనం దూరం అవుతూ రావడం జగద్విదితమే. అయినా కాలానుగుణంగా ధర్మోద్ధరణకై, పతిత జనోద్ధరణకై మహర్షులు, మహనీయులు అవతరిస్తూనే ఉంటున్నారు. జ్ఞానదేవ్, నామదేవ్, ఏకనాథ్, తుకారాం, రామదాస్ మున్నగు మహా భక్తాగ్రగణ్యులు వారివారి జీవన విధానం ద్వారా ఉదాత్తమైన ధార్మిక జీవన ప్రాముఖ్యాన్ని గురించి ఎలుగెత్తి చాటుతూ, సహృదయులకు మార్గదర్శకులవుతూ వస్తున్నారు. ఇక 1918వరకూ సశరీరులుగా ఉంటూ వచ్చిన షిర్డీ సాయిబాబా మహిమాన్విత జీవితాన్ని గురించి చెప్పడానికి నాలాంటి సామాన్యుడు సాహసించడం క్షంతవ్యం కాదనిపిస్తుంది. అయితే ఆ మహనీయుని కృపద్వారా నా పరిమిత జ్ఞానానికి అందిన విషయాలను తోటి భక్తకోటికి అందజేయ యత్నించడానికి లభించిన ఈ మహదవకాశాన్ని సద్వినియోగ పరచుకోవ

కృతకృత్యుణ్ణి కావాలని ఆశించడం తగనిదని కాదని తల పోస్తున్నాను

1918 అక్టోబర్ 15 విజయదశమినాడు సాయిబాబా మహా సమాధి పొందారు మహాసమాధి అనంతరం కూడా ఆ మహనీయుని కృప, రక్ష అశేష భక్తకోటికి లభిస్తవా అన్న సంశయం ఆయన సశరీరులుగా ఉండగానే కొందరికి కలగడం సాయిబాబా వారి భయసందేహాలను తొలగిస్తూ "ఈ భౌతిక దేహాన్ని విడిచి వెళ్ళిన తర్వాత కూడా మరింత చైతన్య వంతంగా శక్తి వంతంగా వ్యవహరిస్తు ఉంటాను—ఎవరైతే నా శరణు వేడుతారో వారి నందరినీ నా సమాధే ఆశీర్వదించి, మాట్లాడుతుంది నా మహా సమాధి అనంతరం కూడా ఎక్కడైనా సరే నన్ను తలచిన క్షణంలోనే మీతో ఉంటాను ' అని వాగ్దానం చేశారు ఈ పవిత్రవాణి అక్షరాలా నిజమని ఈ నాటికీ భక్తకోటికి నిరూపిత మవుతూనే ఉన్న విషయం అనుభవజ్ఞు లందరికీ తెలిసిందే పెక్కుమంది మహనీయుల జీవన విధానాలతో పోల్చి చూస్తే, ఈ మహర్షి జీవన పద్ధతులలోనే ఒక విశిష్టత గోచరిస్తుంది కేవలం జనసామాన్యాన్ని ఉద్ధరించడానికే అవనిపై అవతరించినా అనిపించే ఈ మహర్షి సత్తముడు, ప్రజల జీవితావసరాలపట్ల ముందుగా తగు శ్రద్ధ వహించి, వారిలో భక్తి ప్రపత్తులను క్రమేపి పెంచడం ద్వారా వారి దృష్టిని భగవంతునివైపు, ధార్మిక జీవనం వైపు మరల్చడానికి ఎనలేని కృషి చేస్తు వస్తున్నాడన్న పరమ సత్యం విజ్ఞులకు గోచరించక తప్పదు అందుకే కరుణార్ద్ర హృదయుడైన ఈ పరమపావన మూర్తి "నా భక్తుల ఇళ్ళలో ఆహారానికి, బట్టలకు ఎన్నడూ లోటు ఉండదు ఎవరి మనస్సులను నాలోనే లగ్నంచేసి ఎవరైతే హృదయ పూర్వకంగా నన్ను ఆరాధిస్తారో ఆ భక్తుల యోగక్షేమాలపట్ల నేను ఎల్లప్పుడూ శ్రద్ధ వహించి, అన్ని విధాలా ఆదుకోవడమే నా ప్రత్యేక లక్షణం అని ఎలుగెత్తి చాటుతాడు గీతలో కూడా కృష్ణుడు చెప్పిన విషయం ఇదే సర్వమతాల సారాన్ని ఆకళింపు చేసుకుని మతసామరస్య సాధనకై తదేక దీక్షతో కూడా కృషిచేసిన మానవోత్తముడన్న విషయాన్ని షిర్డీలో ఏకసమయంలో జరుగుతూ వచ్చిన ఉర్సు, శ్రీరామనవమి ఉత్సవాలే ప్రబల నిదర్శన మనిపిస్తుంది తననే దైవంగా ఆరాధించమని ఆ ఋషిపుంగవుడు ఎన్నడూ చెప్పలేదని, ఎవరి ఇష్టదేవతలకు వారు సక్రమంగా, పరిపూర్ణమైన విశ్వాసంతో భక్తి ప్రపత్తులతో ఆరాధిస్తు జీవిత లక్ష్యాన్ని సాధించడానికే అన్ని విధాలా తోడ్పడుతూ వచ్చారని ఆ మహనీయుని జీవితం తెలుపుతుంది మహోన్నత శిఖరాల నందు ఉన్న మహనీయుల శ్రేణిలో ఈ యోగి పుంగవునికి ఒక విశిష్ట స్థానం కలదని రుజువు చేయడానికి, సామాన్యు లందరికీ అందుబాటులో ఉన్నారని నొక్కి వక్కాణించడానికి కొల్లలుగా మనకు ఎన్నో దృష్టాంతరాలు లభిస్తవి తన శక్తి యుక్తుల ద్వారానే కాకుండా మహా సమాధి అనంతరం తాను ఎంచుకున్న దూతల ద్వారా కూడా భక్తకోటి సముద్ధరణకై ఎనలేని కృషి చేస్తున్నారనడానికి ప్రబల తార్కాణం స్వామి శేషయ్యగారి జీవితమేనని అనుభవం కలిగిన ప్రతి ఒక్కరికీ స్పష్టంకాక తప్పదు

1939వ సంవత్సరం జులై ఒకటవ తేదీన స్వామిజీకి శ్రీ సాయిబాబా దర్శనం ఇచ్చి తన కృపను ప్రజలకు అందజేయడానికి ఒక సాధనగా తయారు చేశారు శ్రీ సాయిబాబా తన దూతగా ఆయన్ని ఎన్నుకోడానికి సముచిత కారణాలు ఆయన జీవితాన్ని తరిచి చూచిన వారికి గోచరిస్తవి శ్రీ సాయిబాబా కృపవల్ల నేను సిద్ధుడను అయ్యాను అని 'ప్రతిది బాబా కృపవల్ల దయవల్ల జరుగుతుంది అని స్వామిజీ తనను సందర్శించే భక్తులందరికీ పదేపదే చెబుతూ ఉంటారు. జీవిత సమస్యలతో సతమతమయ్యే అనేక మందికి ఆశాజ్యోతి స్వామిజీ ఆయన వాణి దివ్యవాణిగా పెక్కుమందికి పనిచేయడం అనుభవైకవేద్యమే ఈ పరమ పూజ్యుని సందర్శనం చేసుకొనే మహద్భాగ్యం నాకు సుమారు ఆరున్నర సంవత్సరాలకు పూర్వం తొలిసారిగా బెంగుళూరు హెచ్ ఎమ్ టి కాలనీలో ఆంధ్రప్రభ ప్రస్తుత సంపాదకులు శ్రీ పండితారాధ్యుల నాగేశ్వర రావుగారి ద్వారా కలిగిందని వ్రాయడం ఈ సందర్భంలో అనుచితం కాదని భావిస్తున్నాను ఆనాటి నుంచి నా జీవితంలో ఒక సరికొత్త అధ్యాయం ప్రారంభమైందని సగర్వంగా చెప్ప గలను నాకు నా కుటుంబ సభ్యులకు సంబంధించిన పెక్కు జటిల సమస్యలను వారి ఆశీర్వచన బలంవల్ల బాబా కృపవల్ల పరిష్కరించుకొంటూ ముందుకు పోతున్నానని చెప్పడానికి సాహసిస్తున్నాను స్వామిజీ బెంగుళూరుకు వచ్చినప్పుడు అనేకమంది భక్తులు వారి ద్వారా బాబా కృపకు పాత్రులై పెక్కు విధాల ప్రయోజనాలను పొంద గలుగుతున్నారని అంటే ఆశ్చర్యపడవలసింది ఏమీ ఉండదు అతిశయోక్తి అంతకన్నా కాబోదు

ఈ సందర్భంగా నాకు కలిగిన ఒక అతి ప్రధానమైన అనుభూతిని ఇట పొందుపరుస్తూ ఉడుతాభక్తిగా నేను వ్రాయ తలపెట్టిన ఈ వ్యాసాన్ని ముగిస్తాను

దాదాపు రెండున్నర దశాబ్దాలుగా నా భార్య ఆరోగ్యం అంతంతగా ఉంటూ ఉండేది మామూలు నియమం పాలు కొబ్బరి, గోధుమ ఏ మాత్రం పడేవి కావు అవి తినే

ఉప్పుతినే వాంతులు దాహం తలనొప్పి మొదలైన గుణాలు వచ్చేవి. దంపుడు బియ్యమే. పూర్తిగా పాలిష్ చేసిన బియ్యమో వాడవలసి వచ్చేది. ఎక్కడికి వెళ్లాలన్నా ఈ రకం బియ్యం మూట కట్టుకుని వెళ్ళవలసి వచ్చేది. అక్కడ దొరకకపోతే ఉపవాసం ఉండవలసి కూడా జరిగేది. ఆమెకింగ ఒక పెద్ద గడ్డ ఒకానొక్కగా తయారైంది. ఎన్ని రకాల వైద్యాలు చేసినా ప్రయోజనం లేకపోయింది. ఏమీ చేయలేనని వైద్యులు కూడా చెప్పారు. ఈ ఆధునిక యుగంలో మామూలు బియ్యం అని వాడకుండా జీవించడం కష్టమవు తుందేమోనన్న భీతి నా మనస్సులో కూడ దూరింది. మార్గం ఏమిటా అని మధనపడేవాణ్ణి. స్వామిరేళపయ్యజీని 'మేము సందర్శించడం జరిగిన తర్వాత, ఆమె తిండి సమస్య విషయం చెప్పి కలతో పాటుంకోసం అర్థించాను. మూడేళ్ళ పాటు ఆధ్యాత్మిక సంబంధమైన కొన్ని ప్రక్రియలను చేసి చూడమన్నారు. చిన్నచిన్నగా ఏడాది క్రితం మామూలు బియ్యం. కొద్దిగా మొన్నగురు వదని పదార్థాలను కొద్దిగా వాడా లంధి చేసుకొని తినమని. ఏమీ కీడా చేయదని చెప్పారు. ఆ ప్రకారం చేయడం జరిగింది. దాదాపు నాలుగు నెలల క్రితం పాలు కూడా వాడవచ్చు నన్నారు. ఇప్పుడు ఈ పదార్థాల నన్నింటిని స్వేచ్ఛగా వాడుతూ సులాసాగా ఉంటూ ఉన్నది. ప్రతి పూటా నాకను, స్వామిరేళపయ్యజీని స్మరిస్తూ కాలం గడుపుతూ ఉంది. ఈ విషయాలన్నీ మా కుటుంబంతో సన్నిహిత సంబంధంకల వారందరికి తెలిసి నవే. ఆమె జీవితంతో వచ్చిన మార్పును చూచిన వారంతా ఆశ్చర్యపోతూ ఉంటారు. నిజంగా ఆమె మరొక జన్మ ఎత్తినట్లే భావిస్తుంది. సోదరా, స్వామిరేళపయ్యజీలకు కృతజ్ఞతా పూర్వక ప్రణామము అర్పిస్తూ నిరంతరం వారి ఆశీస్సులకై ప్రార్థిస్తున్నాం.

'భక్తి యుండు జనుల బట్టెంతు వెనువెంట
గోవు వెంట దగులు కోడెభంగి.'

—వేమన

మదరాసులో వెలసిన షిర్డీ

డాక్టర్ చల్లా రాధాకృష్ణశర్మ

సర్వాంతర్యామి అయిన ఆ భగవంతుడు భక్తాధీనుడు. భక్తవత్సలుడనీ మన ప్రగాఢ విశ్వాసం. ఈ విశ్వాసం నిన్న, మొన్నటిది కాదు. యుగ యుగాలుగా, తరతరాలుగా ప్రచారంలో ఉన్న విశ్వాస మిది. కనుక దేశంలో ప్రభవించిన మహా భక్తులూ, మహాత్ములూ ఇది పదే పదే సత్యమని స్పష్టం చేశారు, తమ మహిమల ద్వారా. తెలుసునది. భక్తి మార్గం ముక్తి సాధనకు సోపానం. భక్తిని మించగల మార్గం మరొకటి లేదన్నా, అది అతిశయోక్తి కాదు, కాజాలదు కూడా.

కర్మ, జ్ఞానములు కూడా మోక్షమునకు దారి చూపేవే అయినప్పటికీ. అవి అందరికీ అందుబాటులో ఉండవు. పండితులకు మాత్రమే ప్రీతి పాత్రము లవి. కాని భక్తి మార్గం అటువంటిది కాదు. అది పండిత పామర రంజకం. భక్తి కలుగువాడు మ్లేచ్ఛుడైనా సరే. అతడు మ్లేచ్ఛుడు కాడు. అతడు బ్రాహ్మణోత్తముడు, పండితుడు, ముని శ్రేష్ఠుడు—అని గారుడ పురాణంలోని యీ క్రింది శ్లోకం వల్ల విదిత మవుతున్నది.

> భక్తి రష్టవిధా హ్యేషా యస్మిన్ మ్లేచ్ఛోపి వర్తతే
> స విప్రేంద్రో మునిః శ్రీమాన్ స యతిః స చ
> పండితః.

పైగా, నిశ్చలమైన భక్తి ద్వారా జ్ఞానసంపన్నుడైన మానవుడేకాక జ్ఞానవిహీనమైన జంతువులు సైతం భగవంతుని దర్శించగలిగినట్లు రామాయణంలోని ఉడుత కథ శ్రీకాళహస్తి క్షేత్ర చరిత్ర మొదలైనవి స్పష్టంచేస్తున్నవి. ఆకృతిలో చాలా చిన్నదే అయినా, నిశ్చలమైన భక్తితో, మనస్ఫూర్తిగా, భక్తివంచన లేకుండా సహాయం చేసి ఉడుత రామచంద్రుని ప్రేమను చూరగొన గలిగింది. ఉడుత చేసిన సహాయం ఏ పాటిది? అని కాదు ప్రశ్న. అది ప్రదర్శించిన భక్తి భావం నిరుపమానం. ఆ భక్తి భావానికే రాముడు తన్మయుడై దానిని ఆశీర్వదించాడు.

ధూర్జటి మహాకవి తన కాళహస్తి శతకంలో పదవు సంపదలు విరక్తములని. భగవత్పాదసేవయే మోక్షసాధనమని కాళహస్తీశ్వరుని మనస్ఫూర్తిగా సంస్తుతిస్తూ చెప్పిన యీ పద్యం పరిశీలించండి:

> "ఏ వేదంబు పఠించె లూత, భుజగంబే శాస్త్రముల్
> సూచె, దా
> నే విద్యాభ్యసనం బొనర్చె గరి, చెంచే మంత్ర
> మూహించె, బో
> ధావిర్భావనిదానముల్ చదువులయ్యా కావు, మీ పాదసం
> సేవాసక్తియె కాక జంతుతతికిన్ శ్రీకాళహస్తీశ్వరా."

నేటికి సుమారు వందల ఏండ్లకు మునుపు నివసించిన మహానీయుడూ, సంస్కృత ద్రావిడ భాషాభిజ్ఞుడూ అయిన తాయుమానవర్ 'విద్దై ముత్తి తరుమా?' (విద్య ముక్తి నొసగునా?) అని సూటిగా ప్రశ్నించాడు. గాయక బ్రహ్మ అయిన త్యాగయ్య భక్తివినా సంగీత జ్ఞానము నిష్ఫలమని కుండ బద్దలు కొట్టినట్లు స్పష్టంగా పేర్కొన్నాడు.

> 'విష్ణు భక్తిలేని విబుధుండు విబుధుడే
> పాదయుగముతోడి పశువుగాక....'

అని పోతన కవిశేఖరుడూ,

> 'భక్తి కలుగునాడె పరమార్థపరుడయా'
> 'భక్తి కలుగు కూడు పట్టెడైనను చాలు'

అని వేమన వంటి మానవతా వాదీ మొదలైన మహానీయులు భక్తికి గల ప్రాధాన్యమును చక్కగా వివరించారు.

అంతే కాదు; భగవదారాధన కంటె భగవద్భక్తులను సేవించడమే ఎంతో ఫలప్రద మని కూడా మన పెద్దలు పేర్కొన్నారు. కారణం. భగవంతుడు భక్తపరాధీనుడు. భక్తులకు వశుడైనట్లుగా, భగవంతుడు ఇతరులకు వశంవదుడు కాడు. కనుకనే, తీర్థములలో క్రుంకులిడుటకంటె, భగవద్భక్తుని పాదజలమును శిరమున చిలికించుకోవడం ఫలప్రద మని మన మహాకవులు భావించారు. (శ్రీమహా

కీర్తనము, స్మరణము, పాదసేవ, అర్చనము, వందనము, దాస్యము, సఖ్యము, ఆత్మనివేదనము — అనే యీ నవ విధముల ద్వారా భగవంతుని ఆరాధించడం మంచిదనీ బోధించాడు. శివభక్తులైన నాయన్మారులూ, విష్ణు భక్తులైన ఆళ్వారులూ, రామదాసు వంటి పరమ భక్తులూ మొదలైన వారు ఈ విధంగానే భగవంతుని ఆరాధించి ధన్యజీవు లయినారు.

మన దేశంలో అవతరించిన అవతార పురుషులలో ప్రముఖులు భగవాన్ శ్రీ సాయిబాబా భక్తుల పాలిటి కొంగు బంగారం. ఆయన ప్రవచనాలు ఉన్నత తాత్త్విక రహస్యాలు. మానవసేవయే మాధవసేవకు మహత్తరమైన మార్గమని ఆయన దివ్య సందేశం. ఆధ్యాత్మికత అనేది ఎక్కడో సుదూరంగా లేదనీ, అది మానవుని మనస్సులోనే అణిగి మణిగి వున్నదనీ ఆయన దర్శనం. మొత్తం మీద ఆ మహాత్ముని ప్రవచనములు తరణోపాయములే కాక ఆచరణయోగ్యములు కూడా।

అయితే, మనస్సులో భక్తి స్థిరంగా కుదురుకోవాలంటే, అందుకు మనస్సుని భగవంతుని మీద కేంద్రీకరించాలి. మనస్సు పరిశుభ్రంగా ఉండాలి. మనసు నిల్ప శక్తిలేక పోతే, మధుర ఘంట విరుల పూజ లేమి చేయును? అని త్యాగరాజు మాటిగా ప్రశ్నించాడు. మనస్సుని భగవంతుని మీద నిలిపినప్పుడే, అనగా భక్తి భావం నెలకొన్నప్పుడే, భగవత్ సాక్షాత్కారం సుగమ మవుతుంది. చిత్తశుద్ధి లేని శివపూజ లేలరా? అనీ, ఆత్మశుద్ధి లేని ఆచార మదియేల? అనీ వేమన ఆత్మశుద్ధికి గల వైశిష్ట్యమును లెస్సగా తెలియ జేశాడు. నిజమునకు, ఆత్మశుద్ధికి భక్తి అవినాభావ సంబంధ మున్నది. ఆత్మ శుద్ధిలేని భక్తి భావం వాసన లేని పువ్వు వంటిది. ఆ కోవకు చెందిన భక్తి కేవలం అడంబరంగా పరిణమించవచ్చు.

కనుకనే భక్తి పూర్వకంగా భగవన్నామం ఉచ్చరిస్తే చాలు, అది శుభోదర్కమని శ్రీ సాయిబాబా పేర్కొన్నారు. భౌతిక వాదం పెచ్చు పెరిగిపోతున్న యీ రోజుల్లో తరణోపాయమునకు ఇంతకంటె మించిన మంచి మార్గం మరొకటి కనిపించదు.

1918 లో శ్రీ సాయిబాబా మహా సమాధి పొందినా, ఆ మహాపీయుని అమూల్య ప్రవచనాలను శ్రీ స్వామి కేశవయ్యజీ వంటి భక్తులు ప్రచారం చేస్తున్నారు. భగవద్భక్తి, నైతిక దృష్టి క్రమక్రమంగా తగ్గుముఖం పడుతున్నయీ నాళ్ళలో బాబా ప్రవచనాలకు గల ప్రాధాన్యం ఇంతా అంతా అని చెప్పలేము.

శ్రీ స్వామి కేశవయ్యజీ కృపాసిద్ధి పొందిన భక్తులు, మంత్రాలూ తంత్రాలూ ఆయనకి తెలియవు. తెలిసిందల్లా బాబా ఉపదేశామృతాన్ని నలుగురికీ పంచిపెట్టడమే. బాబా ఉపదేశ సుధారసంతో లాయవాలే ఆయన నిసర్గ సుందర ప్రసంగం శ్రోతలను అనాయాసంగా ఆకట్టుకుంటుంది. పైకి కనిపించని మహిమాన్వితుడు! ఆయన ప్రతి గురువారం మదరాసులో షెనాయ్ నగర్‌లోని సాయి నిలయంలో జరిపే బాబా పూజను తిలకించడానికి, తమ బాధలకు నివారణోపాయములను తెలుసుకోడానికీ ఎందరెందరో అక్కడికి వస్తూ వుంటారు. మదరాసూ, తత్పరిసరాల నుంచే కాక దూర ప్రాంతాల నుంచి కూడా వస్తూ వుంటారు. వారందరి కష్టసుఖాలు కనుక్కొని, వారికి బాబా ప్రసాదమైన 'ఊధీ'ని (విభూతి) ఇచ్చి, ఆయన పడుకు వాళ్ళేసరికి రాత్రి పన్నెండూ, ఒంటి గంటా అవుతూ వుంటుంది.

దక్షిణాదిలో బాబా ప్రవచనాలను ప్రచుర ప్రచారం చేసిన ప్రముఖులూ బాబా భక్తులూ అయిన శ్రీ నరసింహ స్వామిజీ 1945 లో స్వామి కేశవయ్యజీని గురించి చెప్పిన మాటలు ఇక్కడ ఉదాహరించదగినవి. '....శ్రీ సాయిబాబా కరుణాకటాక్షం వల్ల తనకు కొన్ని మహత్తులు అలవడినా, తాను మాత్రం సాయిబాబా దాసుని శ్రీ కేశవయ్య గారు స్పష్టంగా చెపుతారు. ఆయన వినమ్రత, సౌజన్యం, సత్యసంధత మొదలైనవి ఎంతైనా ప్రశంసించదగినవి...' నరసింహస్వామిగారి మాటలు అతిశయోక్తులు కావు; పై పెచ్చు సత్యసంపూర్ణములు।

శ్రీ స్వామి కేశవయ్యజీ అధ్వర్యవంలో మదరాసులో శ్రీ సాయిబాబా భక్త సమాజం ఏర్పడింది. సాయి నిలయంలో గురువారం జరిగే పూజను తిలకించడానికి వచ్చే భక్తుల సంఖ్య ఎక్కువ కావడం, వారికి తగిన వసతి సౌకర్యములు లేకపోవడం, శ్రీరామనవమి గురుపూర్ణిమ మొదలైన వాటిని పురస్కరించుకుని జరుపబడే బహిరంగ సభలకు తగిన సభాస్థలి లేకపోవడం.... ఈ కారణాలను దృష్టిలో ఉంచుకుని సాయి నిలయమునకు అభిముఖంగా ఉన్న స్థలంలో శ్రీ సాయిబాబా మందిరమునూ ప్రార్థనా మండపమునూ నిర్మించాలని సమాజం వారు నిర్ణయించారు. అంతే; ఎక్కడెక్కడి భక్తులూ, పిన్నలూ పెద్దలూ, పేదలూ, ధనికులూ యథోచిత రీతిని విరాళాలు అందజేశారు. సుమారు మూడు లక్షల రూపాయల వ్యయంతో ఈ బృహన్నిర్మాణం సుప్రసిద్ధ వాస్తుశాస్త్రజ్ఞుడు శ్రీ టి. కె. గోవిందరావు పర్యవేక్షణలో తయారయింది. ముద్దులు మూటగడుతున్న యీ మువిశాల మందిరంలో ఒకే సమయంలో మూడు వేలమంది హాయిగా కూర్చో

వచ్చు. ప్రార్థనా మందిరంలో విశ్రాంతిగా ప్రార్థన చేసుకో వచ్చు. ప్రశాంతత లోపించిన మద్రాసు వంటి మహా నగరంలో ఇటువంటి మందిరం భక్తులకు వరప్రసాదం వంటిదన్నా సాహసం కాదు; కానేరదు. శ్రీ బాబా భక్తుల కిది పవిత్ర యాత్రా స్థలం!

చెన్నపట్టణాన్ని రెండవ షిర్డీగా తీర్చిదిద్దిన ఘనత శ్రీసాయిబాబా భక్తసమాజం వారికి దక్కింది. సమాజం స్థాపక — అధ్యక్షులు శ్రీ స్వామి కేశవయ్యజీ చరితార్థులు, ఆయన నిర్విరామప్రకృషి బంగరుఅక్షరాలతో లిఖింపదగింది.

మందిరం నిర్మాణంలో ఉన్న రోజులలో జరిగిన ఒక సంఘటన: యం. యస్. పార్థసారథి ప్రముఖ డాక్టరుగా పేరు పెంపులు గడించిన బాబా భక్తుడు ఒకాయన మందిరాన్ని చూస్తూ ఇలా అనుకున్నాడు. "ఈ మందిరం కోసం స్వామీజీ అహర్నిశలూ ఎంతో కష్టపడుతున్నారు గదా.... స్వామీజీ తదనంతరం ఏమవుతుందో యేమిటో...." అని. ఆ రాత్రి ఆ డాక్టరుగారికి ఒక కల వచ్చింది. బాబా కలలో కనిపించి, 'పిచ్చివాడా! ఈ మందిరం విడిచిపెట్టి నే నెక్కడికి వెళతాను. మందిరంలోనే వుండి నా భక్తుల్ని రక్షించుకుంటాను" అంటూ భక్తుల పాలిట కొంగు బంగారమైన బాబా మందిరంలోకి వెళ్ళి, అక్కడ ఆసీను లైనారట.

శ్రీ సాయి మహిమాన్వితులైన స్వామి కేశవయ్యజీ కనువన్నెలలో రూపరేఖలు సంతరించుకున్న ఈ పవిత్ర మందిరం భక్త కల్పద్రుమమైన శ్రీ సాయిబాబాకి నిలయమవుతుందని ఆయన సర్వకాల సర్వావస్థల లోనూ తన భక్తులను కంటికి రెప్పవలె కాపాడుతూ ఉండగలరని చెప్పడం చర్విత చర్వణమే అవుతుంది.

'ఎందు గలడు విష్ణు, డందు జయశ్రీలు
పొందుగాగ వచ్చి పొందుచుండు.'

—సింగన



సాయి తత్త్వ మహిమాన్వితులు శ్రీ స్వామి కేశవయ్యాజీ

కృష్ణ

1949, మే 5 గురువారం సాయంసమయం ఆరుగంటలవేళ మదరాసులోని షెనాయ్ నగర్‌లో సాయి నిలయం వద్ద సరిగ్గా పదిమంది క్యూలో నిలబడ్డారు. ఆ క్యూ రోజులు గడవను గడవను ఇంతింతై వటుడింతయై అన్నట్లు పెరిగింది.

ఒక్క మాటలో చెప్పాలంటే కొండవీటి చేంతాడయింది.

క్యూలో పురుషులు స్త్రీలు పిన్నలు పెద్దలు నవనాగరకత మూర్తీభవించిన యువతీ యువకులు ఇంకా రకరకాలవారు. ఒక యువతి ఏదో ఒక ఆఫీసులో పని చేస్తోంది. ఆమెకింకా వివాహం కాలేదు. తగిన వరుడు దొరకాలి. అదీ ఆమె దిగులు. మరొక యువతికి వివాహమై పదేళ్ళయింది. కాని సంతానం లేదు. ఇంకో ఇల్లాలికి అన్నీ వున్నాయి. కానీ ఆరోగ్యం సరిగా లేదు. అదే ఆమె మనస్సుని పట్టి పీల్చారుస్తున్న దిగులు. ఎన్నిసార్లు పరీక్షకు వెళ్ళినా, కృతార్థుడు కాలేదు కాబోలు దీనంగా కాలం గడుపుతున్నాడు ఒక యువకుడు. ఇలా ఏవేవో దిగుళ్ళు బాధలూను. కాని ఆశ్చర్యం! బాబాను దర్శనం చేసుకుని బయటకు వస్తున్న వాళ్ళలో అనిర్వచనీయమైన సంతోషం తృప్తి కనిపిస్తున్నాయి. నిజంగానే ఆశ్చర్యం కలిగిస్తుంది యీ దృశ్యం.

ఇంటికో మట్టిపొయ్యి అన్నట్టుగా ప్రతివ్యక్తికీ యేదో ఒక అసంతృప్తి, ఒక బాధ, ఒక దిగులు ఉంటూనే ఉంటాయి. కాని నివారణోపాయం కనిపించే సరికి, అతనికి ఎక్కడలేని సంతోషం కలుగుతుంది. క్రొత్త ఉత్సాహం కలుగుతుంది. మందు మాకులవల్ల ఆరోగ్యం కలగవచ్చు. కాని మనస్సుకి నిజమైన తృప్తి, వ్యక్తికి నిజమైన ప్రశాంతతా ఆధ్యాత్మిక చింతనవల్ల కలుగుతుందనీ మన దేశంలో వెలసిన మహాభక్తులూ మొదలైనవారు తేటతెల్లం చేశారు. శ్రీ సాయిబాబా భక్తులైన శ్రీ స్వామి కేశవయ్యాజీ చేసే గురువారపు పూజలను కనులార తిలకిస్తే యీ విషయం వ్యక్తమౌతుంది. వ్యాధిగ్రస్తులూ సంతానం లేని వాళ్ళూ ఎందరో ఆయన్ని దర్శించిన తర్వాత ఒక విధమైన తృప్తిని చెందారు.

ఈ మధ్య నా మిత్రుడు ఒకాయన మాటల సందర్భంలో ఇలా అన్నాడు: నా భార్య కొన్నేళ్ళుగా ఒక చర్మవ్యాధితో బాధ పడేది. మందు లెన్నో యిప్పించాను. తాత్కాలికంగా నయమయ్యేది. కొన్నాళ్ళకు తర్వాత మళ్ళీ మొదలయ్యేది. ఒక రోజు స్వామి కేశవయ్యాజీని దర్శించి విషయమంతా వివరించాను. ఒక గురువారం పూజానంతరం స్వామీజీ ఆ వ్యాధి వున్న చోట చేతితో తడిమి, ఊది యిచ్చారు. చర్మవ్యాధి మాయమైంది ఆ తర్వాత.

స్వామి కేశవయ్యాజీలో ఏదో ఒక శక్తి ఉంది. గురువారం పూజ తర్వాతనూ శ్రీరామనవమి వంటి ఉత్సవాలు చేసే రోజుల్లోనూ ఆయన పడుకునేసరికి రాత్రి పన్నెండు దాటుతుంది. తన వద్దకు వచ్చే వందలాది భక్తులకు ఆయన సమాధానాలు చెపుతూ వుంటారు. ప్రతిరోజూ భక్తుల జాబులకు జవాబులు వ్రాస్తూ వుంటారు. కాని నేనే బాబాని అని ఆయన

ఎన్నడూ అనలేదు. ఎప్పుడు మాట్లాడినా నేను బాబా భక్తుణ్ణి, నిమిత్తమాత్రుణ్ని— అని అంటూ వుంటారు. ఇది గొప్ప విషయమని నా అభిప్రాయం. వినయం ఆయనకి వెన్నతో పెట్టిన విద్య. మృదువుగా మాట్లాడడం ఆయనకి పెట్టని భూషణం.


సాయిబాబా భక్తులలో ప్రముఖులూ, మహనీయులూ అయిన శ్రీ నరసింహస్వామి గారు స్వామి కేశవయ్యజీని గురించి ముచ్చటిస్తూ యిలా పేర్కొన్నారు: "ఆయనలో ఏవో ఆధ్యాత్మిక శక్తులున్నాయి. ఆయన వినయం, సేవాతత్పరతా కొనియాడదగినవి." నిరాడంబరంగా, నిస్వార్థంగా మానవ సేవచేస్తున్న శ్రీ స్వామి కేశవయ్యజీని గురించి యింతకంటే ఎక్కువగా ఏం చెప్పను?

(ఆంధ్రప్రభ సౌజన్యంతో)

'ఆత్మశుద్ధి లేని యాచార మదియేల
భాండ శుద్ధిలేని పాకమేల
చిత్తశుద్ధి లేని శివపూజ లేలరా
విశ్వదాభిరామ వినుర వేమ.'

—వేమన

Murali Art Press, Madras-17



Inside view of the Mandir